# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :197 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 06-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆఫ్రికా దేశంలో మారణహోమం.. గంటల వ్యవధిలోనే 600 మంది ఊచకోత

ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసో లో భయానక ఘటన వెలుగు చూసింది. బర్సాలోగో పట్టణంలో అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ అనుబంధ ఉగ్రసంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమిన్ (JNIM) మిలిటెంట్లు కిరాతకానికి పాల్పడ్డారు. గంటల వ్యవధిలోనే దాదాపు 600 మందిని కాల్చిపారేశారు (600 Massacred). ఆగస్టు 24న జరిగిన ఈ మారణహోమం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.బైక్‌లపై వచ్చిన ఉగ్రవాదులు కనిపించిన వారిని పిట్టల్లా కాల్చి చంపేశారు. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ప్రాణ భయంతో ప్రజలు పరుగులు పెట్టినా వదిలిపెట్టలేదని.. వారిని వెంబడించి మరీ కాల్పులు జరిపినట్లు తెలిపింది. ఘటన తర్వాత మృతదేహాలను సేకరించేందుకు స్థానిక అధికారులకు మూడు రోజుల సమయం పట్టినట్లు సదరు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. తొలుత ఈ ఘటనలో 200 మంది మరణించినట్లు ఐరాస అంచనా వేసింది. కానీ, 600 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని సమాచారం.

# భాగ్యనగరానికి మహర్దశ 6 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు..



హైదరాబాద్,స్వేచ్ఛ ఇన్వెస్టిగేషన్ టీం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఈనెల 7కు పది నెలలు పూర్తవుతుంది. పదేళ్ల అధికారానికి దూరంగా ఉండి, ఇంత తక్కువ సమయంలో పాలనపై పట్టు సాధించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అంత ఆషామాషీ కాదు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అటు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే ఇటు రాష్ట్ర అభివృద్ధిలో కీలక అడుగులు వేసుకుంటూ ముందుకు వెళ్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు కనిపిస్తోంది. అలాగే, ఆర్‌ఆర్‌ఆర్ పనులను వేగవంతం చేసింది.

**నగరంలో కీలక ప్రాజెక్టులు**

హైదరాబాద్ అభివృద్ధి కోసోం బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. తాజాగా కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్లను విస్తరిస్తోంది.అండర్ పాస్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికోసం పరిపాలన అనుమతులు ఇచ్చింది. రూ.826 కోట్ల వ్యయంతో 6 జంక్షన్లను డెవలప్ చేసేందుకు ప్లాన్ గీసింది. రెండు ప్యాకేజీలుగా వీటిని అభివృద్ధి చేస్తోంది. మొదటగా రెండు ఫ్లైఓవర్లు, మూడు అండర్ పాస్‌లు నిర్మించనుంది. ఇక రెండో విడుతగా నాలుగు ఫ్లైఓవర్లు, నాలుగు అండర్ పాస్‌ల నిర్మాణం ఉంటుంది. వీటి నిర్మాణంతో నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తొలగిపోతాయి. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కేబీఆర్ పార్క్, రోడ్ నెంబర్ 45, ఫిలిం నగర్ జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, పూరి జగన్నాథ్ ఆలయం దగ్గర రూపురేఖలు మారిపోనున్నాయి. ఇక, ప్రతిష్టాత్మక మూసీ ప్రక్షాళన కూడా చేపట్టింది ప్రభుత్వం. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. చాలామంది స్వచ్ఛందంగా తమ ఇళ్లను ఖాళీ చేస్తున్నారు. వీటితోపాటు ఇంకా మరికొన్ని ప్రాజెక్టులను చేపడుతోంది రేవంత్ ప్రభుత్వం. ఇవన్నీ పూర్తయితే, హైదరాబాద్ రూపురేఖలే మారిపోతాయి.

**ఆర్‌ఆర్‌ఆర్‌తో తెలంగాణ బ్రాండ్**

ఇప్పటికే ఓఆర్‌ఆర్ దాకా నగరం విస్తరించింది. చాలా ఏరియాల్లో ఓఆర్‌ఆర్ కూడా దిటి పెద్ద పెద్ద అపార్ట్ మెంట్ల నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్ట్ కీలకంగా మారింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, కేంద్ర పెద్దలతో తరచూ చర్చలు జరుపుతోంది. రీజినల్ రింగ్ రోడ్డు కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంతో తెలంగాణ అంతటా రోడ్ల కనెక్టివిటీ చాలా ఈజీ అవుతుంది.

# తిరుమల లడ్డూ వివాదంలో ట్విస్ట్..



తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో కీలక విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఏఆర్ డెయిరీ సంస్థ కల్తీ నెయ్యి పంపిందని రుజువు చేసేందుకు కావాల్సిన ఆధారాలు దొరికాయని తెలుస్తోంది. కమర్షియల్ ట్యాక్స్ అధికారుల నివేదికలో విషయం తెలిసిందని సమాచారం.తిరుమలకు కావాల్సినంత నెయ్యి సరఫరా చేసే కెపాసిటీ ఏఆర్ డెయిరీ సంస్థకు లేదని వచ్చిన అనుమానం నేపథ్యంలో కమర్షియల్ ట్యాక్ అధికారులు ఆ దిశగా విచారణ మొదలుపెట్టారు. దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ సంస్థ నెయ్యి ఎక్కడి నుంచి సేకరించింది? ఎంత ధరకు సేకరించింది? అనే కోణంలో దర్యాప్తు చేయగా సంచలన విషయాలు బయకొచ్చాయని సమాచారం. తిరుపతి జిల్లాలోని పునబాక వద్ద ఉన్న శ్రీ వైష్ణ వి డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్ నుంచి ఏఆర్ డెయిరీ సంస్థ నెయ్యి కొనుగోలు చేసి, టీటీడీకి పంపించిందని తెలిసింది. అలాగని ఆ నెయ్యి వైష్ణవి డెయిరీలో కూడా తయారు కాలేదు. ఉత్తరాఖండ్‌లోని రూర్కీ జిల్లాలో ఉన్న భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ నుంచి వైష్ణవి డెయిరీ నెయ్యి కొనుగోలు చేసింది. ఆ నెయ్యిని ఏఆర్ డెయిరీకి పంపించగా.. ఆ సంస్థ తిరుమలకు పంపించిందని తమ నివేదికలో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు పేర్కొన్నారు.మొత్తం 5 ట్యాంకర్లలో 8 ట్రిప్పులుగా నెయ్యి తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా అయ్యింది. ఒక ట్యాంకర్ 3 ట్రిప్పుల నెయ్యి అసలు ఏఆర్ డెయిరీకి వెళ్లకుండానే డైరెక్ట్‌గా తిరుమలకు పంపించారు. మరో 4 ట్యాంకర్లు పునబాక నుంచి వందల కిలోమీటర్లు ప్రయాణించి దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ వెళ్లాయి. అక్కడి నుంచి మళ్లీ తిరుమలకు వచ్చాయి. ఏ ట్యాంకర్ ఏ మార్గంలో వెళ్లింది? ఎన్ని టోల్ ప్లాజాలు దాటిందనే వివరాలు కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ, వైష్ణవి డెయిరీ నుంచి ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో ఎంత మొత్తం నెయ్యి కొనుగోలు చేసిందో ఇన్‌వాయిస్ నంబర్లు, ఈ వే బిల్లులతో సహా వెల్లడించింది.రికార్డుల్లో మాత్రమే భోలే బాబా డెయిరీ నుంచి వైష్ణవి డెయిరీ, అక్కడి నుంచి ఏఆర్ డెయిరీ కొనుగోలు చేసినట్లుగా చూపించారని.. వాస్తవానికి ఆ రెండు డెయిరీలు కలిసే దందాను నడిపించాయని తెలుస్తోంది. విపిన్ జైన్, పొమిల్ జైన్‌లే అనే ఇద్దరు భోలేబాబా, వైష్ణవి డెయిరీ రెండింటిలోనూ డైరెక్టర్లుగా ఉన్నట్లు అధికారుల ఎంక్వైరీలో తెలిసింది. దీంతో దీని వెనుక పెద్ద కథ నడిచి ఉంటుందని అనుమానిస్తున్నారు. డెయిరీ నుంచి కొనుగోలు చేసిన ధరల్లో ఉన్న వ్యత్యాసమే ఇందుకు మరో కారణం.భోలే బాబా డెయిరీ నుంచి కిలో నెయ్యి రూ.355 చొప్పున వైష్ణవి డెయిరీ కొనుగోలు చేసింది. అదే నెయ్యిని ఏఆర్ డెయిరీకి రూ.318.57కి సరఫరా చేసింది. ఏఆర్ డెయిరీ టీటీడీకి రూ.319.80కి అందజేసింది. అంటే వైష్ణవి డెయిరీ ప్రతి కిలోకు రూ.36.43 నష్టాన్ని భరించి ఏఆర్ డెయిరీకి విక్రయించినట్లు తెలుస్తోంది. ఇందులో ట్రాన్స్‌పోర్టు ఖర్చులు అదనం. దీంతో అంత నష్టాన్ని భరిస్తూ నెయ్యి ఎందుకు సరఫరా చేస్తుందనే అనుమానాలు వస్తున్నాయి. కచ్చితంగా కల్తీ చేయడం వల్లే అంత తక్కువకు ఇచ్చి ఉంటారని భావిస్తున్నారు. దీంతో తాను కొనుగోలు చేసిన ధర కంటే తక్కువకు ఎలా నెయ్యిని సరఫరా చేసిందనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# సుప్రీంకోర్టు తీర్పు ఎవరు కోరుకున్నట్లు వచ్చినట్లు?



న్యూఢిల్లీ,కొండ మీది వ్యవహారం ఏడు కొండల మీదే ముగుస్తుందనుకున్నారు. కానీ మాడవీధులు దాటి..ఏపీలో రాజకీయ దుమారం లేపి..దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇంతింతై పెద్ద ఇష్యూ అయింది శ్రీవారి లడ్డూ వివాదం. స్వామివారి ప్రసాదం అపవిత్రం అయిందన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలతో మొదలైన దుమారం దేశవ్యాప్తంగా హిందువుల ఆగ్రహానికి కారణమైంది. ఏపీ సర్కార్ సిట్ వేసింది. కానీ పంచాయతీ తేగేలా కనిపించలేదు. అంతలోనే వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి లాంటి వారు సుప్రీంకోర్టు మెట్లెక్కడంతో..స్పెషల్ టీమ్‌తో దర్యాప్తు జరగాలంటోంది సుప్రీంకోర్టు.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడారన్న ఇష్యూపై ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరఫున ఇద్దరు పోలీసు అధికారులు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ నుంచి ఒక సీనియర్ అధికారి సభ్యులుగా ఉండాలని సూచించింది. స్వతంత్ర సిట్ దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని స్పష్టం చేసింది అత్యున్నత న్యాయస్థానం. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు సుప్రీంకోర్టు తెలిపింది.

**పూర్తిగా సీబీఐ పరిధిలో లేకుండా..**

అయితే సుప్రీం తీర్పు ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వైసీపీ సీబీఐ ఎంక్వైరీకి డిమాండ్ చేసింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాత్రం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ పిటిషన్ వేశారు. అటు పూర్తిస్థాయిలో సీబీఐ ఎంక్వైరీ కాకుండా.. ఇటు మాజీ న్యాయమూర్తితో కాకుండా.. స్పెషల్ సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది సుప్రీంకోర్టు. పూర్తిగా సీబీఐ పరిధిలో లేకుండా.. అలా అని ఏపీ ప్రభుత్వ పరిధిలో లేకుండా..సీబీఐ నుంచి ఇద్దరు..ఏపీ ప్రభుత్వం తరఫున ఇద్దరు పోలీసు అధికారులు ఉండేలా ఆర్డర్స్ ఇచ్చింది అత్యున్నత న్యాయస్థానం. సుప్రీం ఇచ్చిన తీర్పును సీఎం చంద్రబాబుతో పాటు వైసీపీ నేతలు కూడా స్వాగతిస్తున్నారు. సత్యమేవ జయతే అని చంద్రబాబు అంటుంటే..సుప్రీం ఆర్డర్స్ చంద్రబాబుకు చెంప పెట్టులాంటివని..న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు మాజీ సీఎం జగన్‌తో పాటు భూమన, వైవీ సుబ్బారెడ్డి స్టేట్‌మెంట్లు ఇచ్చారు. అయితే సుప్రీం తీర్పు..ఎవరు ఆశించినట్లు వచ్చిందన్న చర్చ జరుగుతోంది. ఇదో రకంగా చంద్రబాబుకు అనుకూలంగా వచ్చినట్లు భావించాలంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. ఏదో ఒక కేంద్ర పరిధిలోని సంస్థతో ఎంక్వైరీ జరగాలని చంద్రబాబు కోరుకున్నారని..ఇప్పుడదే జరగబోతుందని విశ్లేషిస్తున్నారు.లడ్డూ వివాదంపై డైలాగ్ వార్ కొనసాగుతుండగానే సిట్ ఏర్పాటు చేసింది ఏపీ సర్కార్. అయితే సీబీఐ విచారణకు కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని వైసీపీ డిమాండ్ చేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి కార్నర్ అయిపోయే పరిస్థితి వచ్చింది. ఇంతలోనే సుప్రీంలో పిటిషన్లు దాఖలు అవడం..విచారణ కొనసాగుతుండటంతో సిట్ విచారణను నిలిపివేసింది ఏపీ ప్రభుత్వం. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఓ ప్రత్యేక టీమ్ దర్యాప్తు చేయనుంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉండాలన్న సుప్రీం ఆదేశాలతో స్పెషల్ సిట్ అనేది ఓ న్యూట్రల్ టీమ్‌గా విశ్లేషించబడుతోంది.

**ఈ రెండు విమర్శలకు చెక్?**

ఏపీ సర్కార్ వేసిన సిట్ నెయ్యి కల్తీ జరిగిందని తేల్చినా.. కల్తీ జరగలేదని తేల్చినా సీఎం చంద్రబాబే విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చేది. నెయ్యి కల్తీ అయిందని లోకల్ సిట్ చెప్తే చంద్రబాబు చెప్పుచేతల్లోని టీమ్ వాళ్లకు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చిందని విమర్శలు వచ్చేవి.కల్తీ జరగలేదని తేల్చినా కూటమి సర్కార్ వేసినా సిట్టే కల్తీని నిర్ధారించలేదని.. చంద్రబాబు రాజకీయ దురుద్దేశంతో రాద్ధాంతం చేశారన్న ఆరోపణలు ఎదురుకోవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఈ రెండు విమర్శలకు చెక్ పెట్టినట్లు అయిందంటున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. అంతేకాదు వైసీపీ కూడా సుప్రీం చెప్పిన ప్రత్యేక సిట్ ఏర్పాటును స్వాగతిస్తుండటంతో..స్పెషల్ సిట్ ఇచ్చే రిపోర్టును కూడా ఒప్పుకోక తప్పదంటున్నారు.సో ఇప్పుడు ప్రత్యేక సిట్ చేతిలో ఏపీ రాజకీయం ఇరుక్కుపోబోతుంది. స్పెషల్ సిట్ తేల్చే వరకు లడ్డూ లడాయిపై పార్టీలు సైలెంట్‌గా ఉండే అవకాశం కనిపిస్తోంది. సేమ్‌టైమ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌లో పనిచేస్తున్న ఇద్దరు పోలీసు అధికారులను స్పెషల్ సిట్‌లో నియమించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.ఆ అధికారులు ఇప్పటికే తమ మూడు రోజుల విచారణలో సేకరించిన అంశాలను సీబీఐ ఆఫీసర్లతో పాటు FSSAI ఆఫీసర్ ముందు పెట్టనున్నారు. ఫైనల్‌గా ఇప్పుడు సుప్రీం వేసిన స్పెషల్ సిట్ ఇచ్చే రిపోర్టే లడ్డూ కల్తీ వ్యవహారాన్ని తేల్చడంతో పాటు..ఏపీ రాజకీయ ముఖచిత్రాన్ని మారే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

# ముగ్గురి ఉసురు తీసిన ఆన్ లైన్ బెట్టింగ్..



ఎడపల్లి:అన్యోన్యంగా సాగుతున్నా ఓ కుటుంబం కుమారుడు ఆన్లైన్ బెట్టింగు అప్పులు ఎక్కువై సుమారు 18 లక్షల అప్పులతో మోయలేని భారంతో నలుగురిలో తిరగలేక శుక్రవారం రాత్రి ముగ్గురు కుటుంబ సభ్యులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎడపల్లి మండలం వడ్డపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగనేని. సురేష్ భార్య హేమలత కుమారుడు హరీష్ అన్యోన్యంగా సాగుతున్న కుటుంబం గత 20 సంవత్సరాల నుండి వ్యవసాయంతో పాటు కిరాణా షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు ఈ క్రమంలో కుమారుడా హరీష్ ఆన్లైన్ బెట్టింగ్లతో పాటు అప్పులు చేయడంతో ఎక్కువ మోతాదుల అప్పులు కావడంతో తల్లిదండ్రులు గతంలో 0.20 గుంటల భూమిని అమ్మి గతంలో అప్పులను చెల్లించారు అయినా కుమారుడు తీరుమాంక అప్పులు ఆన్లైన్ బెట్టింగ్లతో సుమారు 18 లక్షలు అప్పులు కావడంతో అప్పుల వారు ఆన్లైన్ వారి ఒత్తిడి కావడంతో నలుగురిలో తిరగలేక మనస్తాపం చెంది శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు వారి ఇంట్లో చీరల సహాయంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.శనివారం ఉదయం పక్కన ఉన్న పొరుగువారు లేవకపోవడంతో డోర్ ను కొట్టిన తియక కపోవడంతో ఇంటి వెనకల ఉన్న కిటికీ గుండా చూడడంతో ముగ్గురు ఉరివేసుకొని ఉండటం గమనించి ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించగా ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణ రెడ్డి ఘటన స్థలం చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనమ నిర్వహించి మృతదేహాలకు పోస్టు మార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కుటుంబంలో ముగ్గురికి ముగ్గురు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం పట్ల వడ్డపల్లి గ్రామంలో తీవ్ర విషాదాలు అలుముకున్నాయి.

## ముంబైలో ఎన్సీపీ నేత దారుణహత్య

ముంబై:మహారాష్ట్రలోని ముంబైలో దారుణం చోటుచేసుకుంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అజిత్ పవార్ వర్గానికి చెందిన నేత సచిన్ కుర్మీ హత్యకు గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి బైకుల్లా ప్రాంతంలో దుండగులు ఆయనపై పదునైన ఆయుధంతో దాడి చేశారు. పలుమార్లు పొడిచి పారిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని రక్తపుమడుగులో పడి ఉన్న సచిన్ కుర్మీని ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే సచిన్ చనిపోయారని వైద్యులు ప్రకటించారు. ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో ఈ హత్య జరిగింది. సచిన్ కుర్మీ ప్రస్తుతం ఎన్సీపీ బైకుల్లా అధ్యక్షుడిగా ఉన్నరని పార్టీ నేతలు చెబుతున్నారు. ఆయన హత్యపై తీవ్రంగా మండిపడుతున్నారు. హంతకులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.సచిన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. హంతకులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనా స్థలానికి సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కాగా, సచిన్ కుర్మీ హత్యను ఎన్సీపీ ముంబై అధ్యక్షుడు సమీర్ భుజ్ బల్ తీవ్రంగా ఖండించారు. సచిన్ మృతిపై విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# 24 గంటల్లోగా డిమాండ్లను నెరవేర్చకుంటే నిరాహార దీక్ష..



కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌కు చెందిన యువ వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు సమ్మెను విరమించారు. అయితే వారు తమ డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వానికి 24 గంటల గడువు ఇచ్చారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి నారాయణ్ స్వరూప్ నిగమ్‌ను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం, కోల్‌కతాలోని ధర్మతాలకు చెందిన జూనియర్ డాక్టర్ దేబాశిష్ హల్దర్ సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే 24 గంటల్లోగా తన డిమాండ్లను నెరవేర్చకుంటే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.శుక్రవారం సాయంత్రం ధర్మతాళ్ల కూడలిలో వీరి ఊరేగింపుపై ఉద్రిక్తత నెలకొంది. వేదికపై బారికేడ్లు వేసి ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా తొలగించారని ఆరోపించారు. 24 గంటల్లోగా డిమాండ్లు నెరవేర్చకుంటే రేపటి నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని, ఇందులో భాగంగా కొందరు ఇక్కడే ఉంటామని, మరికొందరు పశ్చిమ బెంగాల్ ప్రజలకు సేవ చేస్తూనే ఉంటామని చెప్పారు. కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా బుధవారం సిలిగురిలోని నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, ఇంటర్న్‌లు టార్చ్‌లైట్ ఊరేగింపు నిర్వహించారు.

# ఇజ్రాయెల్‌కు షాక్ ఇచ్చిన ముస్లిం దేశాలు!..



సెంట్రల్ డెస్క్:హిజ్బుల్లా, ఇరాన్‌తో విభేదాల మధ్య అరబ్ దేశాలు ఇప్పుడు ఇజ్రాయెల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలాయి. టెహ్రాన్, ఇజ్రాయెల్ మధ్య వివాదంలో తాము తటస్థంగా ఉంటామని ఇరాన్‌కు భరోసా ఇవ్వడానికి అరబ్ దేశాలు ఈ వారం దోహాలో సమావేశమయ్యాయి.ఈ ప్రాంతంలో వివాదాలు పెరగడం వల్ల తమ చమురు కేంద్రాలకు ముప్పు వాటిల్లుతుందని అరబ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది ఇజ్రాయెల్‌కు దెబ్బగా పరిగణించబడుతోంది, ఎందుకంటే ఏప్రిల్‌లో ఇరాన్ దాడి సమయంలో అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చాయి.

**ఇజ్రాయెల్‌పై ఇరాన్ అతిపెద్ద దాడి**

ఖతార్ నిర్వహించిన ఆసియా దేశాల సమావేశంలో పాల్గొన్న గల్ఫ్ అరబ్ దేశాలు, ఇరాన్ మంత్రులు ఉద్రిక్తతను తగ్గించడంపై పరస్పర చర్చలను కేంద్రీకరించినట్లు పలు వర్గాలు తెలిపాయి. ఈ వారం మంగళవారం (అక్టోబర్ 1) ఇరాన్ ఇప్పటివరకు ఇజ్రాయెల్‌పై అతిపెద్ద దాడి చేపట్టింది. గాజా, లెబనాన్‌లలో హమాస్, హిజ్బుల్లా సీనియర్ నాయకులను చంపినందుకు ప్రతీకారంగా ఈ దాడిని చేపట్టినట్లు ఇరాన్ అభివర్ణించింది. శుక్రవారం, అక్టోబర్ 4, ఇరాన్ యొక్క సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తన ప్రసంగంలో ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడిని 'అత్యల్ప శిక్ష'గా అభివర్ణించారు.

**ఇజ్రాయెల్ ప్రతీకార బెదిరింపు**

అయితే, తమ దాడి ముగిసిందని, అయితే ఇజ్రాయెల్ ఏదైనా రెచ్చగొట్టే చర్య తీసుకుంటే అది మళ్లీ లక్ష్యంగా ఉంటుందని టెహ్రాన్ పేర్కొంది. అదే సమయంలో, ఇరాన్ దాడికి ధీటుగా సమాధానం ఇస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది.ప్రతీకారంగా ఇరాన్‌లోని చమురు ఉత్పత్తి కేంద్రాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోవచ్చని యూఎస్ మీడియా నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నింటిలో టెన్షన్‌ని తగ్గించే అంశం అగ్రస్థానంలో ఉందని ఒ రాయిటర్స్ పేర్కొంది. గల్ఫ్ చమురు కేంద్రాలపై దాడి చేస్తామని ఇరాన్ బెదిరించనప్పటికీ, ఇజ్రాయెల్‌కు మద్దతుగా ప్రత్యక్ష జోక్యం ఉంటే ఈ ప్రాంతంలో దాని ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.


## సంపాదకీయం

ఆదివారం 06-10-2024

# జమ్మూకశ్మీర్ ఎన్నికలు

జమ్మూకశ్మీర్‌లో పదేండ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పలు రకాలుగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలను కశ్మీరీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని చెప్పాలి. ఒకరకంగా చెప్పాలంటే ఆర్టికల్ 370 రద్దు ద్వారా కశ్మీర్‌కు దఖలు పడిన ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడంపై ఈ ఎన్నికలను ప్రజాభిప్రాయ సేకరణగా భావించవచ్చు. ఈ ఎన్నికల్లో 63.45 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది ఇటీవలి పార్ల మెంట్ ఎన్నికల సగటు 57.89 కంటే ఎక్కువ. అంతేకాదు, 2008 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 61.01 కంటే ఎక్కువ. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, సోఫియాన్, కుల్గాం, ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లాల్లో ఓటింగ్ భారీగా పెరిగింది. దక్షిణ కశ్మీర్‌లో జమాతే ఇస్లామీ మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులు, ఉత్తర కశ్మీర్‌లో బారాముల్లా ఎం పీ ఇంజినీర్ రషీద్ పోటీని అవామీ ఇత్తేహాద్ పార్టీ పోటీ కారణంగా పోలింగ్ శాతం పెరిగింది. 370 రద్దుతో ఓటుహక్కు పొందిన పాక్ కాందిశీకులు, వాల్మీకి తెగ ప్రజలు, గూరా?లు ఈ ఎన్నికల్లో తొలిసారిగా తమ హక్కును వినియోగించుకోవడం విశేషం. వారి ఓటు నిర్ణయాత్మకం కావాలనే అంచనాలు ఉన్నాయి. కశ్మీర్ అస్తిత్వాన్ని సమూలంగా మార్చివేసిన బీజేపీ విధానాలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష లాంటివి. పదేండ్ల క్రితం పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీజేపీ, పీడీపీలు ఈసారి విడివిడిగా బరిలోకి దిగాయి. బీజేపీ చేతుల్లోకి కశ్మీర్ వెళ్లకుండా అడ్డుకోవాలనే లక్ష్యంతో ఎన్సీ, కాంగ్రెస్ జట్టు కట్టాయి. స్థానిక సమస్యలు, కూడు, గూడు లాంటి వాటికి కాకుండా ప్రత్యేక హోదా పునరుద్ధరణ, రాష్ట్ర హోదాను తిరిగి కల్పించడం లాంటి అంశాల మీదే ఎన్నికల ప్రచారం సాగింది. రాష్ట్ర విభజన తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రమే చక్రం తిప్పుతోంది. ఇది సగటు కశ్మీరీకి ఏ మాత్రం నచ్చని అంశమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒకవేళ ఈ ఎన్నికల్లో బీజేపీ గనుక గెలిస్తే ఆర్టికల్ 370 రద్దుకు ప్రజల మద్దతు ఉందని ప్రచారం చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా ప్రజలు రాష్ట్ర హోదా పునరుద్ధరణ దిశగా అడుగులు వేయవచ్చు. అలా కాకుండా హంగ్ ఏర్పడి అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిస్తే మాత్రం ఎలాగైనా చేజిక్కించుకునేందుకు స్వతంత్ర అభ్యర్థులు, చిన్నాచితకా పార్టీలను తనవైపు తిప్పుకోవాల్సి ఉంటుంది. అదే కాంగ్రెస్, ఎన్సీ కూటమి గెలిస్తే రాష్ట్ర హోదా పొందకుండా కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రాష్ట్ర హోదాతో పాటు ఆర్టికల్ 370 కోసం డిమాండ్లు ఊపందుకోవచ్చు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ చేయాలంటూ కూటమిలోని ఎన్సీ డిమా ండ్ చేస్తుండగా, కాంగ్రెస్ కేవలం రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తోంది. ఈ కారణంగా గెలిచినా ఎన్నాళ్లు కూటమిలో ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో జమాతే ఇస్లామీ, ఇంజినీర్ రషీద్, పీడీపీ మద్దతు కీలకం. ఏదేమైనప్పటికీ కశ్మీరీలు అధిక సంఖ్యలో వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం అభినందించాల్సిన విషయం. ఎలాంటి అల్లర్లు జరగకుండా, రీపోలింగ్ ప్రశాంతంగా ఎన్నికలు ముగియడం ప్రజాస్వామ్యానికి శుభసూచకం.

# అమెరికా వైఖరి ఎవరికి లాభం?



వాషింగ్టన్,ఒకవైపు ఇజ్రాయెల్, ఇరాన్ పేట్రేగిపోవడానికి, మరోవైపు రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతుండగా అగ్రరాజ్యం అమెరికా వైఖరియే పరోక్ష కారణంగా విశ్లేషకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలు నిజమనడానికి వెనుక నుండి ఒక వర్గానికి ఏకపక్షంగా అమెరికా కొమ్ముకాస్తున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. మంగళవారం (అక్టోబర్ 1) రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఇరాన్ అకస్మాత్తుగా ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం కురిపించింది. ఒక అరగంటసేపు ఇజ్రాయెల్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆ సమయంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన సైన్యానికి ఇజ్రాయెల్‌కు సహాయంగా రంగంలోకి దూకాలని పిలుపు ఇవ్వడం తీవ్రంగా ఆక్షేపించవలసిన విషయం. ఇరాన్ క్షిపణుల దాడిని అంతకు రెండు గంటలకు ముందే ఇజ్రాయెల్‌ను హెచ్చరించడం కూడా ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం. పశ్చిమాసియాలో రావణ కాష్ఠంలా రణజ్వాలలు ఎగసిపడుతుంటే మధ్యవర్తిత్వం వహించి ఆయా దేశాల మధ్య ప్రతీకారాగ్ని చల్లార్చవలసిన అగ్రరాజ్యం ఆ మంటలకు చలికాచుకుంటూండడంలో వ్యూహం ఏమిటి? ఇజ్రాయెల్, హమాస్, ఇరాన్ వీరంతా ఒకరినొకరు దాడులతో, ప్రతిదాడులతో దేశాలను శ్మశానంగా, ప్రజానీకంలో మార్చిలో కనీసం కనీసం రోగులు కొనఊపిరితో బట్టకట్టనీయకుండా మారణహోమం సాగుతుంటే మిగిలిన నెత్తురుటేరుల మట్టిని ఎవరైనా ఎలా పాలించగలుగుతారు? పాలించి ఏం సాధిస్తారు. ఇది కేవలం రాక్షసత్వం తప్ప మరేం కాదు. అగ్రరాజ్యం అమెరికా ఇదంతా ఏమీ పట్టనట్టు ప్రేక్షక పాత్ర వహించడమే కాకుండా తన మిత్రపక్షం ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండదండలు అందిస్తోంది. ఇజ్రాయెల్‌కు, హమాస్ సంస్థకు గాజాలో సాగుతున్న యుద్ధంలో తక్షణం మానవతాయుతంగా కాల్పుల విరమణను పాటించాలంటూ ఐక్యరాజ్యసమితి కొన్ని నెలల క్రితమే చౌరవ భద్రతా మండలిలో తీర్మానాన్ని ప్రతిపాదించగా వీటో అస్త్రం ద్వారా అమెరికా మోకాలడ్డడం ఎవరూ మర్చిపోలేదు. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ యుద్ధం ప్రపంచ శాంతికి ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరిస్తూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. అత్యంత మానవ విషాదాన్ని అరికట్టడానికి ఐక్యరాజ్యసమితి అరుదుగా ప్రయోగించే నిబంధన కింద ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. 15 మంది సభ్యులు గల భద్రతా మండలిలో తీర్మానానికి అనుకూలంగా 13 మంది ఓటు వేయగా, బ్రిటన్ గైర్హాజరైంది. అమెరికా ఒక్కటే వీటోను ప్రయోగించి తీర్మానం అమలులోకి రాకుండా నీరు కారించింది. ఈ తీర్మానం అమలైతే హమాస్‌కే మేలు జరుగుతుందని ఆనాడు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు వితండవాదన లేవదీశాయి. ఇజ్రాయెల్‌పై మొదట హమాస్ జరిపిన దాడిలో 1700 మంది దుర్మరణం పాలయ్యారు. ఆ సమయంలో హమాస్ కొంత మంది ఇజ్రాయెలీలను బందీలుగా తీసుకెళ్లారు. ఇది వాస్తవమే. కానీ బందీలను విడిపిస్తామని, హమాస్‌ను మట్టుబెడతామని ఇజ్రాయెల్ అప్పటి నుంచి సాగిస్తున్న దాడుల్లో ఎన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయారో ప్రపంచానికి తెలుసు. 1967 లో వారం రోజుల పాటు జరిగిన యుద్ధంలో తూర్పు జెరూసలెం సహా జోర్డాన్ నది పశ్చిమతీరం, గాజా ప్రాంతం ఇజ్రాయెల్ స్వాధీనమైపోయాయి. ఈ రెండు ప్రాంతాలని పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దయాదాక్షిణ్యాల మీదనే బతుకుతున్నారు. వారికి గుర్తింపు పొందిన సొంత భూభాగమంటూ లేదు. ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాలు రెండు ఇరుగుపొరుగున శాంతియుత సహజీవనం సాగించేలా జరగాలనే ప్రతిపాదన, అందుకు అమెరికా సహకరించడం లేదు. ఈ నేపథ్యంలో హమాస్ అవతరించి గాజ భూభాగంలోని పాలస్తీనియన్ల మద్దతు పొందుతోంది. అమెరికాలో అధికారంలోకి వచ్చినా అక్కడి యూదు ఓట్ల పరంగానూ, అరబ్ దేశాలను అణచి ఉంచే కుటుంబం కోసం అంతర్జాతీయ రాజకీయాల్లో పైచేయి సాధించడం కోసం స్వతంత్ర పాలస్తీనా వ్యతిరేక వైఖరి అమెరికా కొనసాగుతోంది. ఇజ్రాయెల్ దురాక్రమణకు కొమ్ముకాస్తూ వస్తోంది. పాలస్తీనాకు స్వతంత్ర దేశాన్ని ఇవ్వనంత వరకు ఇలాగే పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. మారణ హోమం, రక్తపాతం తరచుగా ఉంటాయి. ఇజ్రాయెల్‌కు దాని మద్దతుదారులైన అమెరికా, పాశ్చాత్య దేశాలకు కావలసింది కూడా ఇదే. అంతర్జాతీయ రంగంలో అమెరికా బలం సన్నగిల్లితే కానీ ఇజ్రాయెల్ దారికి వచ్చే సూచనలు లేవు. మరోపక్క ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఎంతకాలం ఇంకా కొనసాగుతుందో చెప్పలేం. ఉక్రెయిన్ సొంత బలంతో కాకుండా అమెరికా నుంచి లభించే ఆయుధ సాయంతో రష్యాతో ఢీకొంటోంది. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా చైనా ఇరాన్‌కు మద్దతు ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలస్తీనియన్ల పరిస్థితి దయగా మారుతోంది.

# పెట్రోల్ ధరలు పెరుగుతాయా,భారతీయులపై ప్రభావమెంత?



మధ్య ప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఘర్షణలు ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. ఇరాన్ దాడి తర్వాత ప్రతీకారం గురించి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మాట్లాడారు. "ఇరాన్ పెద్ద తప్పు చేసింది. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఆయన అన్నారు. నెతన్యాహు ఇది చెప్పడానికి ఒక రోజు ముందు అంటే సెప్టెంబర్ 30న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనతో మాట్లాడారు. ఆ తర్వాత "మన ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు లేదు" అని ట్వీట్ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నేరుగా యుద్ధం ప్రారంభమైతే, భారత్‌పై పడే ప్రభావమెంత? అనేది చర్చనీయాంశంగా మారింది.

### సామాన్య భారతీయుని జేబులకు చిల్లుపడుతుందా?

ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేసిన తర్వాత, మధ్య ప్రాచ్యంలో ఘర్షణలు మరింత చెలరేగాయి. దీని ప్రభావం నేరుగా చమురు ధరలపై పడుతుంది. ఇరాన్ క్షిపణి దాడులు చేస్తుందన్న అంచనాలతోనే, అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 3% పెరిగాయంటే దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

అంతర్జాతీయంగా చమురు ధరలకు బ్రెంట్ క్రూడ్ అనేది బెంచ్‌మార్క్. ఈ బెంచ్‌మార్క్‌లో ఒక్కో బ్యారల్ ధర 1% పైగా పెరిగి 74.40 డాలర్లకు చేరుకుంది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో 5% పైగా పెరిగింది. "ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యలో యుద్ధం మొదలైతే, భారత్‌లో సామాన్య ప్రజల జేబులపై నేరుగా ప్రభావం పడుతుంది" అని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్‌లోని సీనియర్ ఫెలో డాక్టర్ ఫజుర్ రెహమాన్ అన్నారు. "యుద్ధం వస్తే, దాని ప్రభావం కేవలం ఇరాన్‌కే పరిమితం కాదు. అఫ్గనిస్తాన్, ఇరాక్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈలపై కూడా పడుతుంది. ఇవన్నీ భారత్‌కు పెద్ద ఎత్తున చమురు ఎగుమతి చేసే దేశాలు" అని ఫజుర్ రెహమాన్ పేర్కొన్నారు. "ఒకవేళ దాడులు తీవ్రమైతే చమురు సరఫరా తగ్గుతుంది, డిమాండ్ పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితిలో, చమురు ధరలు పెరిగి భారత్‌పై నేరుగా ప్రభావం పడుతుంది" అని ఫజుర్ రెహమాన్ అన్నారు.

### భారత్‌కు దౌత్యపరమైన సవాళ్లు

ఇరాన్, ఇజ్రాయెల్‌లతో భారత్‌కు మంచి దౌత్య సంబంధాలు ఉన్నాయి. ఇండియాకు చమురు సరఫరా చేసే దేశాల్లో ఇరాన్ ఒకటి. అణు కార్యక్రమం కారణంగా ఇరాన్‌పై విధించిన అంతర్జాతీయ ఆంక్షలకు ముందు, ఇరాన్ భారతదేశానికి రెండో అతిపెద్ద చమురు ఎగుమతిదారు.

అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ, ఇరాన్‌తో భారత్ జాగ్రత్తగా సంబంధాలను కొనసాగిస్తోంది. ఇటీవల ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించినప్పుడు, భారత ప్రభుత్వం ఒక రోజు సంతాప దినం ప్రకటించింది. మరోవైపు, ఇజ్రాయెల్‌తో కూడా భారత్‌కు దౌత్య సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ 1948లో ఒక దేశంగా ఉనికిలోకి వచ్చింది. 1992 నుంచి భారత్ దానితో దౌత్య సంబంధాలు మొదలు పెట్టింది. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు రోజురోజుకూ బలపడుతూ వచ్చాయి. ఇప్పుడు భారతదేశానికి ఆయుధాలు, టెక్నాలజీ ఎగుమతి చేస్తున్న అగ్రదేశాల్లో ఇజ్రాయెల్ కూడా ఒకటి. "ఇరు దేశాల మధ్యలో దౌత్య సంబంధాలను బ్యాలెన్స్ చేయడం భారత్‌కు సవాలే. ఇప్పటి వరకు ఈ పనిని చాలా అద్భుతంగా చేసింది. భారత దౌత్యం గత పదేళ్లలో ఎక్కడా కూడా ఒకవైపు మాత్రమే ఉండేలా నిర్ణయాలు తీసుకోలేదు" అని ఫజుర్ రెహమాన్ అన్నారు. "ఇరు దేశాల మధ్య ఈ విధంగా సమతుల్యతను పాటించడమే దౌత్యం. భారత్ ఎవర్నీ నిరాశపరచదు" అని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో నెల్సన్ మండేలా సెంటర్ ఫర్ పీస్ అండ్ కాన్ఫ్లిట్ రిజొల్యూషన్ శాఖ ప్రొఫెసర్ రేష్మి కాజీ అన్నారు. "ఒకవేళ ఇజ్రాయెల్ వైపుకు భారత్ మొగ్గుచూపితే, ఇరాన్‌తో సంబంధాలపై ప్రభావం పడుతుంది. దీనివల్ల గల్ఫ్‌లో జీవిస్తున్న భారతీయులు వ్యక్తిగతంగా ప్రభావితులవుతారు" అని ఆమె అన్నారు. "ఇటీవల పోర్చుగీస్ జెండాతో వెళుతున్న కార్గో నౌకను ఇరాన్ నియంత్రణలోకి తీసుకున్నప్పుడు, ఆ నౌకలో 17 మంది భారతీయులు ఉన్నారు. భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ జోక్యం తర్వాత భారతీయులను విడుదల చేశారు. ఇరాన్ విషయంలో ఏదైనా వివక్ష చూపితే, వారు ఎలా స్పందిస్తారన్నదాన్ని ఇలాంటి ఘటనల ద్వారా అర్థం చేసుకోవచ్చు" అని కాజీ అన్నారు.

### భారత ప్రాజెక్టులకు ఎదురుదెబ్బ అవుతుందా?

ఇరాన్ చాబహార్ పోర్టు భారత్‌కు చాలా కీలకం. ఈ పోర్టు సాయంతో అఫ్గనిస్తాన్, మధ్య ఆసియాతో వాణిజ్యం కోసం పాకిస్తాన్ గుండా వెళ్లాల్సిన అవసరం భారత్‌కు లేకుండా పోయింది. చాబహార్‌లో షాహిద్ బెహెస్తీ పోర్టును అభివృద్ధి చేసేందుకు ఇరు దేశాలు 2015లో ఒప్పందం చేసుకున్నాయి. "ఇజ్రాయెల్ మధ్యలో యుద్ధం మొదలైతే, చాబహార్ లాంటి ప్రాజెక్టులను ఇరాన్ పక్కనబెట్టొచ్చు. ఇజ్రాయెల్‌తో పోరాటం వారికి ప్రాధాన్యంగా మారుతుంది. దీని వల్ల ప్రాజెక్టు పనులు ఆగిపోతాయి" అని ఫజుర్ రెహమాన్ అన్నారు. మధ్య ప్రాచ్యంలోని భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా చాబహార్ ప్రాజెక్టు ఇప్పటికే బాగా ప్రభావితమైందని రేష్మి కాజీ అన్నారు. ఈ ప్రాజెక్టు మళ్లీ ఆగిపోయే పరిస్థితి ఉందని కాజీ అభిప్రాయపడ్డారు. మధ్య ప్రాచ్యంలో చాలా పెద్ద ప్రాజెక్టులలో భారత్ భాగమైందని, ఒకవేళ యుద్ధం మొదలైతే, ఈ ప్రాజెక్టుల నుంచి ఫోకస్ పూర్తిగా పక్కకు పోతుందని, సమయానికి పూర్తయ్యే అవకాశం తగ్గుతుందని ఫజుర్ రెహమాన్ అన్నారు. 2023లో దిల్లీలో జరిగిన జీ20 సదస్సులో ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్ట్‌పై సంతకాలు జరిగాయి. భారత్, అమెరికా, సౌదీ అరేబియా, యూఏఈ, యూరోపియన్ యూనియన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీలు దీనిలో భాగస్తులు. పెద్ద ఎత్తున రవాణా నెట్‌వర్క్‌ను నెలకొల్పడమే ఈ కారిడార్ లక్ష్యం. ఈ కారిడార్ సాయంతో, భారత్ ఉత్పత్తులు గుజరాత్‌లోని కాండ్ల పోర్టు నుంచి యూఏఈ, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, గ్రీస్ మీదుగా యూరప్‌కు సులభంగా చేరుకుంటాయి. యుద్ధం వస్తే, ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్‌కు అతిపెద్ద నష్టం. ఈ కారిడార్ టైమ్‌లైన్ పూర్తిగా దెబ్బతింటుంది. అంతేకాక, ఐ2యూ2 లాంటి వ్యాపార బృందాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ఈ గ్రూప్‌లో భారత్, ఇజ్రాయెల్, అమెరికా, యూఏఈలు ఉన్నాయి.

### విదేశీ మారకపు నిల్వలపై ప్రభావం

పని కోసం చాలామంది భారతీయులు గల్ఫ్‌కు వెళ్తుంటారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, బహ్రెయిన్ , ఖతార్, కువైట్‌లో 90 లక్షల మంది భారతీయులు జీవిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది అంటే దాదాపు 35 లక్షల మందికిపైగా యూఏఈలో ఉన్నారు. సౌదీలో 25 లక్షల మంది, కువైట్‌లో 9 లక్షల మంది, ఖతార్‌లో 8 లక్షల మంది, ఒమన్‌లో 6.5 లక్షల మంది, బహ్రెయిన్‌లో 3 లక్షల మందికి పైగా భారతీయులు ఉంటున్నారు. ఇరాన్, ఇజ్రాయెల్‌లలో కూడా భారతీయులు వేలల్లో ఉన్నారు. ఈ ప్రాంతాల్లో నివసించే వారు తాము సంపాదించిన డబ్బులో కొంత భారత్‌కు పంపుతుంటారు. భారత రూపాయితో పోలిస్తే గల్ఫ్ దేశాల కరెన్సీలు చాలా బలంగా ఉంటాయి. దీని నుంచి కార్మికులు ప్రయోజనం పొందుతున్నారు. బహ్రెయినీ దినార్ విలువ సుమారు రూ.222, ఒక ఒమనీ రియాల్ విలువ సుమారు రూ.218 పలుకుతుంది. "గల్ఫ్ దేశాల్లో నివసించే భారతీయులు లక్షల డాలర్లను స్వదేశానికి పంపుతుంటారు. దీనివల్ల భారత విదేశీ మారకపు రిజర్వులు బలంగా ఉంటున్నాయి. ఒకవేళ ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యలో యుద్ధం మొదలైతే, ఈ నిల్వలపై నేరుగా ప్రభావం పడుతుంది" అని డాక్టర్ ఫజుర్ రెహమాన్ చెప్పారు. 17వ లోక్‌సభలో విదేశాంగ వ్యవహారాల

# రహదారులు, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం

అమరావతి,ఏపీ సీఎం చంద్రబాబు రహదారులు, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు . గత ప్రభుత్వం హయాంలో రహదారులు, ప్రాజెక్టులు నిర్లక్షానికి గుర్యాయని. వాటిని పునరుద్ధరించి జాతీయ స్థాయిలో రహదారులు, ప్రాజెక్టులను పునరుద్ధరించాలని నిర్నయానికివ వచ్చినట్లు తెలుస్తోంది. మళ్లీ విజన్ దిశగా అడుగులు వేయడం ప్రారంభించారు. నిన్న మొన్నటి వరకు అంటే సెప్టెంబరు మాసం అంతా కూడా రెండు కీలక విషయాలతోనే పాలన సరిపోయిం ది. దీంతో ప్రభుత్వం పరంగా పెద్దగా ఏమీ చేయలేకపోయారు. ఎలాంటి నిర్ణయాలు కూడా తీసుకోలేక పోయారు. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు రాష్ట్రంలో వరదలు, తుఫానులతోనే కాలం గడిచిపోయింది. వీటి నుంచి ప్రజలను రక్షించడం.. సమీక్షలు.. సాయం అంటూ కాలం కరిగిపోయింది. దీనికితోడు కృష్ణానదిలో 4 ఐరన్ పడవల వ్యవహారం కూడా సర్కారుకు తలనొప్పిగా మారింది. ఈ విషయాల నుంచి కొంత బయటకు వచ్చే సమయంలో ఆ తర్వాత.. 15 రోజులు కూడా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం తెరమీదికి వచ్చింది. ఈ పరిణామాలతో సెప్టెంబరు మాసం అంతా కూడా గడిచి పోయింది. ఇక, ఇప్పుడు అక్టోబరు ప్రారంభం నుంచి చంద్రబాబు రూటు మార్చేశారు. ముందుగానే నిర్దేశించుకున్న మేరకు నూతన మద్యం విధానాన్ని తీసుకువచ్చారు. అదేవిధంగా ఇప్పుడు కీలకమైన రెండు నిర్ణయాలను అమలు చేసే దిశగా అడుగులు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా పీ-4 పథకానికి ఆయన పచ్చ జెండా ఊపారు. దీని ప్రకారం.. పబ్లిక్-ప్రైవేట్-ప్రభుత్వం-పార్టనర్ షిప్(పీ-4) కింద రహదా రులను అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా స్టేట్ హైవేస్‌ను ఈ పథకం కిందే డెవలప్ చేసేందుకు మార్గనిర్దేశం చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఆరు మాసాల్లో రోడ్లు అద్దాల్లా మెరిసేలా నిర్ణయం తీసుకున్నారు. ఇక, మరో కీలక నిర్ణయం గ్రోత్ రేట్‌ను 15 శాతానికి చేర్చడం. ప్రస్తుతం రాష్ట్ర గ్రోత్ రేట్ 7.8 శాతంగా ఉంది. అయితే.. మౌలిక వసతుల కల్పన,ఉ పాధి, విద్యారంగాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా.. ప్రజల ఆదాయ వృద్ధి రేటు తదనుగుణంగా రాష్ట్ర వృద్ధిని కూడా 15 శాతానికి పెంచేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటారు. వచ్చేరెండున్నరేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తులు కూడా పెంచనున్నారు. దీంతో రాష్ట్ర వృద్ధిని 15 శాతానికి పెంచాలని నిర్ణయించారు. ఈ పరిణామాలతో చంద్రబాబు తిరిగి విజన్ దిశగా అడుగులు ప్రారంభించినట్టు అయింది.

# సోయా మిల్క్ అమృతంతో సమానమే..!

హైదరాబాద్,సోయా పాలు పూర్తిగా మొక్కల నుంచి లభించే ప్రోటీన్. శరీరానికి అవసరమైన అనేక ముఖ్యమైన అమినో యాసిడ్స్ ఈ పాలలో ఉంటాయి. సోయా పాలలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ పాలలో కాల్షియం, పొటాషియంలు పుష్కలంగా ఉంటాయి. సోయా పాలలో కొలస్ట్రాల్ అసలు ఉండదు. అలాగే శాచురేటెడ్ ఫ్యాట్స్ కూడా చాలా తక్కువగా ఉంటాయి. సోయా పాలు తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అండాశయానికి సంబంధించిన సమస్యలు ఉన్నవారు మాత్రం ఈ పాలను తాగకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల అలెర్జీ, ఇతర చర్మ సమస్యలు ఇబ్బంది పెట్టే అవకాశం ఉందంటున్నారు. ఇందులో ఈస్ట్రోజెన్ అధిక పరిమాణంలో లభిస్తుంది. ఇది శరీరంలో హార్మోన్లను పెంచేందుకు సహాయపడుతుంది. కాబట్టి అతిగా ఈ పాలను తాగొద్దు. మోనోపాజ్ సమయంలో చాలా మంది మహిళలు బోలు ఎముక వ్యాధికి గురవుతారు. సోయా పాలు తాగడం వల్ల ఆ సమస్య రాకుండా ఉంటుంది. సోయా పాలలో కొవ్వులు తక్కువ. ప్రోటీన్లు, ఫైబర్ కంటెంట్ పుష్కలంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకునేవారికి సోయా పాలు మంచి ఆహారం. జుట్టు పెరుగుదలకు సోయా పాలు చాలా ఉపయోగపడతాయి. జుట్టు పెరుగుదులకు అవసరమయ్యే ప్రోటీన్లను సోయా పాలు కలిగి ఉంటాయి. సోయా పాలలోని కొన్ని సమ్మేళనాలు చనిపోయిన చర్మ కణాలను తొలగిస్తాయి. అలాగే చర్మాన్ని తేమగా ఉంచుతాయి. చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. కాల్షియం శాతం ఎక్కువగా ఉండే సోయా పాలను క్రమం తప్పకుండా తాగితే ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. సోయాబీన్ పాలు ప్రతి రోజూ తాగితే శరీరంలో హిమోగ్లోబిన్‌ను పెంచుతాయి. ఇందులో ఫైబర్ వంటి మినరల్స్ పుష్కలంగా లభిస్తాయి. కాబట్టి సులభంగా రక్తహీనత సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సోయా పాలలో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అంతే కాకుండా సోయా మిల్క్ తాగడం వల్ల బరువు నిర్వహణ, మధుమేహం, చర్మానికి కూడా మేలు జరుగుతుంది. ఇందులో విటమిన్ బి12 అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి ఈ పాలను ప్రతి రోజూ తాగడం వల్ల శరీర బల హీనత సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా శరీరం శక్తవంతంగా తయారవుతుంది. బరువు తగ్గాలనుకుంటే సోయాబీన్ పాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా లభిస్తాయి.

# రుణమాఫీ అందలేదు

హైదరాబాద్,సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందని కేటీఆర్ అన్నా రు. 100% రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి డొల్లమాటలే అని మరోసారి తేలిపోయిందన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్న సన్నాసి మాటలు మోసం తప్ప మరొకటి కాదా అని ప్రశ్నించారు. రాబందు ప్రభుత్వం ఉంటే రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, రేవంత్ అసమర్థత ధాన్యం దాతలకు కోలుకోలేని శాపమని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఒకవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని మాయమాటలు చెప్పి.. మరోవైపు 10 నెలల తర్వాత కూడా 20 లక్షల మందిని మోసం చేశారని మండిపడ్డారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ?? అని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే.. 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో ?? అని ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోని శాపం అని ట్విటర్ వేదికగా సీఎం పై మండిపడ్డారు.

## వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది

అమరావతి, గత ప్రభుత్వ హయాంలో సర్వేపల్లిలో ఇసుక, గ్రావెల్ అక్రమాలు భారీగా జరిగాయని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. కోట్ల రూపాయల అవినీతికి అప్పటి వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని ఆయన మండిపడ్డారు. సూరాయపాలెంలో రూ. 54 కోట్లు, విరువూరులో రూ. 37 కోట్ల రూపాయల మేర పెనాల్టీని గనుల శాఖ విధించిందని, రైతుల పేరుతో అనుమతులు తెచ్చి లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ ను తవ్వేశారన్నారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కనుసన్నల్లోనే అవినీతి, అక్రమాలు జరిగాయని, ప్రధాన దోపిడీదారుడైన కాకాణి గోవర్ధన్ రెడ్డికి మైనింగ్ అధికారులు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు.మైనింగ్ అధికారులను ఎందుకు ఆయనను విచారణ చేయడం లేదని, ఇది మంచి పద్ధతి కాదు.. కరోనా టైంలో హౌస్ లో కూర్చుని సర్వేపల్లిని దోచుకున్న వ్యక్తి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన రూ.106 కోట్ల అవినీతి 10శాతం మాత్రమే అని, ఇంకా 90 శాతం బయటపడాలని ఆయన అన్నారు. అంతేకాకుండా.. ఐదేళ్ల పాటు అక్రమంగా ఇసుక, గ్రావెల్, సిలికా, తెల్లరాయి తవ్వకాలు జరిగాయని, ఈ అక్రమాలపై విచారణ చేయాలన్నారు. ఈ భారీ దోపిడీలో జగన్ ప్యాలస్ .. సజ్జలకు వాటాలు పంపారని, అక్రమంగా ప్రజల సొత్తు దోచేసిన కాకాణికి కటకటాల వెనక్కి పంపిస్తామన్నారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. లడ్డూ వ్యవహారంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, తప్పు చేసిన ఏ ఒక్కరిని ఆ దేవదేవుడు వదిలిపెట్టడన్నారు.

## భార్యను గొడ్డలితో అతి కిరాతకంగా హత్య చేసిన భర్త

నంద్యాల,నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామంలో భర్త రామ్మోహన్ భార్యను గొడ్డలితో అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. అనంతపురం జిల్లా యాడికి మండలం కోనప్పలపాడు గ్రామానికి చెందిన రామ్మోహన్‌కు పార్వతిని ఇచ్చి వివాహం చేశారు. వివాహం జరిగిన రెండు సంవత్సరాల నుండి కుటుంబంలో గొడవలు జరుగుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తరచుగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో పుట్టినిల్లు అయిన కనకాద్రిపల్లెలో పార్వతి నివాసం ఉంటుంది. భర్త రామ్మోహన్ తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. జులాయిగా తిరుగుతున్న రామ్మోహన్ మూడు నెలలకు ఒకసారి ఆరు నెలలకు ఒకసారి భార్య వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి రామ్మోహన్ భార్య పార్వతిని గొడ్డలితో అతి కిరాతకంగా హత్య చేసి కత్తితో విచక్షణ రహితంగా శరీర భాగాలు కోసి పరారయ్యాడు. ఉదయం లేచిన తన కుమారుడు పవన్ కుమార్ రక్తపు మడుగులో ఉన్న తల్లిని చూసి పరిగెత్తి అవ్వగారికి విషయం చెప్పాడు. పార్వతి కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి రక్తపు మడుగులో ఉన్న పార్వతి అప్పటికే మృతి చెందిది. మృతి చెందిన పార్వతిని చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న కొలిమిగుండ్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల పోలీసులు తెలిపారు.

## చిత్తు అవ్వుతారా ?

బీహార్: ఎందరో సీఎంలను చేశాను అని పీకే అలియాస్ ప్రశాంత్ కిశోర్ అనుకోవచ్చు. సినిమాలో దర్శకుడు అద్భుతంగా నటన ఇదీ అని చూపించి హీరోకి నేర్పించవచ్చు. కానీ వెండి తెర మీద ప్రేక్షకులు నీరాజనాలు పట్టేది హీరోకే. అంటే ఆయనకు ఉన్న గ్లామర్ జనాకర్షణ ఇవన్నీ తోడు అవుతాయి.అలా పీకే అలియాస్ ప్రశాంత్ కిశోర్ నేనే జగన్ ని సీఎం గా చేశాను లేక స్టాలిన్ సీఎం కావడానికి నా ఐడియాలే అరువిచ్చాను అనుకోవచ్చు. అరవింద్ కేజ్రీవాల్ క్రేజ్ పెరగడానికి మోడీ 2014లో తొలిసారి దేశానికి ప్రధాని కావడానికి మమతా బెనర్జీ మూడవసారి పశ్చిమ బెంగాల్ సీఎం కావడానికి నేనే కారణం అని ఆయన అనుకున్నా తప్పులేదు.కానీ నేనే బీహార్ సీఎం అని ప్రశాంత్ కిశోర్ భావిస్తే మాత్రం పప్పులోనూ తప్పులోనూ కాలేసినట్లే అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే బీహార్ అన్నది కులాల కురుక్షేత్రం. అక్కడ గత మూడు దశాబ్దాలుగా కుల సమరమే సాగుతోంది. పైగా కాంగ్రెస్ 1989లో అంతరించాక అక్కడ అయితే ఆర్జేడీ లాలూ లేకపోతే జేడీయూ నుంచి నితీష్ కుమార్ మాత్రమే ముఖ్యమంత్రులుగా అంతా చూశారు. లాలూ తన తరువాత సతీమణి రబ్రీదేవిని సీఎం ని చేసి ఏళ్లకు ఏళ్ళు తెర వెనక చక్రం తిప్పినా బీహార్ జనం నీరాజనం పలికారు తప్ప ఇదేమిటి అనలేదు.ఇక లాలూ గడ్డి కుంభకోణం సహా అవినీతి ఆరోపణల మీద జైలుకు వెళ్ళినా ఆయనకు ఉన్న ఓటు బ్యాంక్ చెక్కు చెదరలేదు. లాలూ కుటుంబ పాలన అవినీతి పాలన అని బీజేపీ ఎంత అరచి గీ పెట్టినా ఆయన వైపే మెజారిటీ జనాలు ఉన్నారు. అంతవరకూ ఎందుకు 2020 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా ఆర్జేడీ ఉంది.ఇక నితీష్ కుమార్ కూడా బీసీలు ఇతర కులాల ఆసరాతో నే రాజకీయం చేస్తూ వస్తున్నారు. బీజేపీ కానీ కాంగ్రెస్ కానీ ఈ రెండు పార్టీలతో సర్దుకుని ముందుకు పోతోంది. అటువంటి బీహార్ లో పీకే జనసూరజ్ పేరుతో పార్టీని పెట్టారు. ఆయన పార్టీ పెట్టడానికి ముందు పాదయాత్ర కూడా పెద్ద ఎత్తున చేశారు.ఆయన బీహార్ మొత్తం తిరిగి జనం గురించి తెలుసుకున్నారు. వారి విషయంలో ఆయన అవగాహన పెంచుకున్నారు. ఇక తాను అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్య నిషేధం అన్నారు. మహిళలకు టికెట్లలో వాటా అన్నారు. బీసీలు ఇత ర వర్గాలకు కూడా గణనీయమైన స్థానం అన్నారు. ముస్లిం వర్గాలను కూడా ఆకట్టుకునేలా హామీలు ఇస్తున్నారు.అన్నీ బాగానే ఉన్నాయి కాబీ పీకే ఈ ఎన్నికల్లో ఎలా నెగ్గుకుని రాగలరు అన్నదే ప్రశ్న. ఆయన నితీష్ కుమార్ ని టార్గెట్ చేశారు. ఆయన ఆరోగ్యం మీద కూడా విమర్శలు చేస్తున్నారు. ఆర్జేడీని కూడా ఏకి పారేస్తున్నారు. ఆ రెండు పార్టీలే దశాబ్దాలుగా బీహార్ వెనకబాటుతనానికి కారణం అని కూడా ఆయన ఆరోపిస్తున్నారు.ఇన్ని చేసినా బీహార్ ప్రజలు మాత్రం తమ నేతలుగా వారినే చూస్తారు అని అంటున్నారు. ఎందుకంటే అక్కడ అక్షరాస్యత తక్కువ. పైగా వ్యక్తి పూజ, కులాభిమానం బాగా ఎక్కువ. లాలూ నితీష్ జనంలో పాతుకుని పోయారు. మరి వీరిని ఛేదించుకుని జనం మద్దతు పొందడం అంటే కష్టమనే చెప్పాలి.బీహార్ లో ఈసారి జనసూరజ్ పార్టీ ఏ మేరకు తన ప్రభావాన్ని చూపిస్తుంది అన్నది చూడాలి తప్ప పీకే గెలిచి అధికారం అందుకుంటారు అన్నది మాత్రం అయ్యేది కాదు అని అంటున్నారు. వ్యూహాలు వేరు వాటిని అమలు చేసే ఇమేజ్ ఉన్న ఫిగర్ వేరు అన్నది ఈ ఎన్నికల తరువాత పీకేకు తెలుస్తుంది అని అంటున్నారు. జనామోదం ఉన్న ఫిగర్ ని ముందు పెట్టి ఎన్ని వ్యూహాలు చేసినా చెల్లుతుంది కానీ తెర వెనక వారే ముందుకు వస్తే జనాలు ఆదరించరు

# తన రికార్డ్ తనే తిరగరాసిన సీఎం చంద్రబాబు..



తిరుమల, ఏపీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు మరో రికార్డు సృష్టించనున్నారు. ఇప్పటివరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరై.. స్వామివారికి పట్టు వస్త్రాలు అధిక సార్లు సమర్పించిన సీఎంగా చంద్రబాబు చరిత్ర కెక్కనున్నారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రభుత్వం తరఫున.. సీఎం హోదాలో ఉన్న నేత పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ అనంతరం.. శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా.. నేడు సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించనున్నారు. ఈ మేరకు టీటీడీ అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు.ఏడాదికి ఒకసారి శ్రీవారి బ్రహ్మోత్సవాలను టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంది. ఈ బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుండే కాక దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. అంతేకాకుండా విదేశీయులు సైతం శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడాన్ని.. పుణ్యకార్యంగా భావిస్తారు. అందుకే ఈ ఏడాది కూడా శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ ఈవో శ్యామల రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.కాగా శ్రీవారికి ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీ 1978 నుండి ప్రారంభమైందని తెలుస్తోంది. తొలిసారిగా శ్రీవారికి నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కొన్నేళ్లు స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ అధికారులే సమర్పించగా, 1984లో ముఖ్యమంత్రిగా ఉన్న నందమూరి తారక రామారావు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీని పునః ప్రారంభించారు. ఇలా చంద్రబాబు సైతం సీఎం హోదాలో 2003లో పట్టు వస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు వెళుతున్న క్రమంలో అలిపిరి వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నుండి అదృష్టవశాత్తు బయటపడ్డారు. తనకు తిరుమలేశుడు పునర్జన్మ ఇచ్చినట్లు బాబు నాడు ప్రకటించారు.ఇలా తమ ఇంటి ఇలవేల్పుగా తిరుమల శ్రీ శ్రీనివాసుడిని సీఎం చంద్రబాబు పూజిస్తారు. తాజాగా జరిగిన ఏపీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం చంద్రబాబు తిరుమల పర్యటనకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే తన పరిపాలన ప్రక్షాళన తిరుమల నుండే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 1995 లో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా భాధ్యతలు చేపట్టిన చంద్రబాబు.. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 1999-2004, 2014-19 సంవత్సరాలలో సీఎంగా గల బాబు.. ఆ పదేళ్ళ కాలంలో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తాజా గెలుపుతో నాల్గవసారి సీఎంగా గెలుపు అందుకున్న చంద్రబాబు.. ప్రస్తుతం జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇప్పటికి పది సార్లకు పైగా.. శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎంగా చంద్రబాబుకు రికార్డు సొంతమైందని చెప్పవచ్చు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుమల, కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణానికి ముందురోజు నిర్వహించే అంకురార్పణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేనాధిపతి విశ్వక్సేనుల ఉత్సవం ఘనంగా జరిగింది. మాడవీధుల్లో విశ్వక్సేనుల ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 5.45 గంటలకు బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మీనలగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పురాణాల ప్రకారం శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలిసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవున్ని పిలిచి లోకకల్యాణం కోసం తనకు ఉత్సవాలు నిర్వహించాలని ఆజ్ఞాపించారట. ఈ ప్రకారం ఆనందనిలయం మధ్యలో ఆవిర్భవించిన శ్రీవేంకటేశ్వరుడికి కన్యామాసం(ఆశ్వయుజం) లోని శ్రవణ నక్షత్రం నాటికి పూర్తయ్యేలా బ్రహ్మదేవుడు తొమ్మిదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించారట. అందువల్లే ఇవి 'బ్రహ్మోత్సవాలు'గా ప్రసిద్ధిచెంది అప్పటినుండి నిరాటంకంగా కొనసాగుతున్నాయి. అక్టోబరు 4 నుండి 12వ తేదీ వరకు 9 రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తి అయిన శ్రీ మలయప్పస్వామివారు వివిధ వాహనాలపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దివ్యదర్శనం కల్పిస్తారు. బ్రహ్మోత్సవ వాహనసేవలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి ఏర్పాట్లు పూర్తిచేసింది. భక్తులందరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శ్రీవారి వాహన సేవలతో పాటు మూలవిరాట్ దర్శనం కల్పించేందుకు టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశాయి.ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ సాయంత్రం 6.30 నుండి రాత్రి 11 గంటల వరకు జరుగుతుంది.ఆలయ నాలుగు మాడ వీధులలో భక్తులను ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్యాలరీలలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. భక్తులు మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బారికేడ్లు, క్యూలైన్ల గేట్లు పటిష్టంగా ఏర్పాటు చేశారు. అక్టోబర్ 4వ తేదీ సాయంత్రం 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేస్తారు. ఈ కార్యక్రమం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. ఆ తరువాత రాత్రి 9 నుండి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరుగుతుంది. మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఏడుతలల స్వర్ణ శేషవాహనంపై(పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహిస్తారు. ఆదిశేషుడు శ్రీహరికి మిక్కిలి సన్నిహితుడు. రామావతారంలో లక్ష్మణుడుగా, ద్వాపరయుగంలో బలరాముడుగా శ్రీమన్నారాయణుడికి మిక్కిలి సన్నిహితంగా ఉన్నవాడు శేషుడు. శ్రీవైకుంఠంలోని నిత్యసూరులలో ఇతడు ఆద్యుడు, భూభారాన్ని వహించేది శేషుడే. శేషవాహనం ముఖ్యంగా దాస్యభక్తికి నిదర్శనం. ఆ భక్తితో పశుత్వం తొలగి మానవత్వం, దాని నుండి దైవత్వం, ఆపై పరమపదం సిద్ధిస్తాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకిగా భావిస్తారు. శ్రీవైష్ణవ సంప్రదాయానుసారం భగవంతుడు శేషి, ప్రపంచం శేషభూతం. శేషవాహనం ఈ శేషిభావాన్ని సూచిస్తుంది. చిన్నశేష వాహనాన్ని దర్శిస్తే భక్తులకు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు వీణాపాణియై హంసవాహనంపై సరస్వతిమూర్తి అవతారంలో దర్శనమిస్తారు. బ్రహ్మ వాహనమైన హంస పరమహంసకు ప్రతీక. హంసకు ఒక ప్రత్యేకత ఉంది. అది పాలను, నీళ్లను వేరుచేయగలదు. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. అందుకే ఉపనిషత్తులు హంసను పరమేశ్వరునిగా అభివర్ణిస్తున్నాయి. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా భక్తులలో అహంభావాన్ని తొలగించి దాసోహభావాన్ని(శరణాగతి) కలిగిస్తాడు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారి దశావతారాల్లో నాలుగవది నరసింహ అవతారం కావడం సింహం గొప్పదనాన్ని తెలియజేస్తోంది. యోగశాస్త్రంలో సింహం బలానికి(వహనశక్తి), వేగానికి(శీఘ్రగమన శక్తి) ఆదర్శంగా భావిస్తారు. భక్తుడు సింహబలం అంతటి భక్తిబలం కలిగినప్పుడు ? భగవంతుడు అనుగ్రహిస్తాడు అని వాహనసేవలో అంతరార్థం. మూడో రోజు రాత్రి శ్రీ మలయప్పస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు



దర్శనమిస్తారు. జ్యోతిషశాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాలకింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. క్షీరసాగరమథనంలో ఉద్భవించిన విలువైన వస్తువుల్లో కల్పవృక్షం ఒకటి. కల్పవృక్షం నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. కల్పవృక్ష వాహన దర్శనం వల్ల కోరిన వరాలను శ్రీవారు అనుగ్రహిస్తారని భక్తుల విశ్వాసం.శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిస్తారు. సర్వభూపాల అంటే విశ్వానికే రాజు అని అర్థం. అంటే శ్రీవారు సకల దిక్పాలకులకు రాజాధిరాజని భావం. తూర్పుదిక్కుకు ఇంద్రుడు, ఆగ్నేయానికి అగ్ని, దక్షిణానికి యముడు, నైరుతికి నిరృతి, పశ్చిమానికి వరుణుడు, వాయువ్యానికి వాయువు, ఉత్తరానికి కుబేరుడు, ఈశాన్యానికి పరమేశ్వరుడు అష్టదిక్పాలకులుగా విరాజిల్లుతున్నారు. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై, హృదయంలో ఉంచుకుని సేవిస్తారు. తద్వారా వారి పాలనలో ప్రజలు ధన్యులవుతారు అనే సందేశాన్ని ఈ వాహనాన్ని అధిరోహించడం ద్వారా స్వామివారు తెలియజేస్తున్నారు.బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు ఉదయం శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా భాసిస్తూ దర్శనమిస్తాడు. పక్కనే స్వామి దంతపుపల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు. ప్రపంచమంతా తన మాయావిలాసమని, తనకు భక్తులైనవారు ఆ మాయను సులభంగా దాటగలరని మోహినీ రూపంలో ప్రకటిస్తున్నాడు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు రాత్రి గరుడవాహనంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీ మలయప్పస్వామివారు తిరుమాడ వీధులలో నింపాదిగా ఊరేగుతూ భక్తులందరికీ తన దివ్యమంగళ రూపదర్శనమిస్తాడు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. దాస్య భక్తితో కొలిచే భక్తులకు తాను దాసుడినవుతానని గరుడవాహనం ద్వారా స్వామివారు తెలియజేస్తున్నాడు. మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని స్వామివారు భక్తకోటికి తెలియజెప్పుతున్నాడు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఉదయం శేషాచలాధీశుడు రాముని అవతారంలో తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తాడు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. గురుశిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వవివేచన తెలిసిన మహనీయులు కావున ఈ ఇరువురినీ చూసిన వారికి వేదాలతత్త్వం ఒనగూరుతుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సాయంత్రం శ్రీనివాసుడు స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. స్వర్ణరథం స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైంది. ఈ స్వర్ణోత్సవ సేవలో కల్యాణకట్ట సేవాపరులు తొలుత బంగారు గొడుగును అలంకరించడం సంప్రదాయంగా వస్తోంది. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు రథగమనాన్ని వీక్షించిన ద్వారకా ప్రజలకు ఎంతో ఆనందం కలిగింది. స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీనివాసుడిని చూసిన భక్తులకు కూడా అలాంటి సంతోషమే కలుగుతుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు రాత్రి వేంకటాద్రీశుడు గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిస్తాడు. శ్రీవారిని గజేంద్రుడు మోస్తున్నట్టు భక్తులు కూడా నిరంతరం శ్రీనివాసుని హృదయంలో పెట్టుకుని శరణాగతి చెందాలని ఈ వాహనసేవ ద్వారా తెలుస్తోంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజున ఉదయం సూర్యప్రభ వాహనంపై శ్రీమన్నారాయణుడు తిరుమాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షిస్తారు.

# ఏపీ మహిళలకు దసరా కానుక

అమరావతి,టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీ ప్రజలకు దసరా కానుకను ఇస్తుందా అంటే భారీగానే అని ప్రచారం సాగుతోంది. ఈ నెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు అని అంటున్నారు. అందులో ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కొన్నింటిని అయినా దసరా నుంచి అమలు చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారు అని అంటున్నారు. మహిళలకు దసరా కానుకగా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వరాన్ని బాబు ఇవ్వబోతున్నారు అని పెద్ద ఎత్తున ప్రచారం అయితే సాగుతోంది. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం విషయం మీద మంత్రి వర్గం సీరియస్ గనే చర్చిస్తుంది అని అంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీ అధికారుల బృందం కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో పర్యటించి వచ్చి మరీ ఒక నివేదికను ప్రభుత్వానికి అందించారు అని అంటున్నారు. ఆ నివేదిక మీద మంత్రి వర్గం కీలకమైన నిర్ణయం తీసుకుంటుంది అని అంటున్నారు. జిల్లా పరిధిలోనే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది అని అంటున్నారు. అంటే సొంత జిల్లాలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా వెళ్లవచ్చు. మరి దీనికి సంబంధించి విధి విధానాలను కూడా ఖరారు చేశారు అని అంటున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి ఈ చాన్స్ అని అంటున్నారు. పేదరికమే కొలమానంగా ఈ ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించాలా లేక అందరికీ అవకాశం ఇవ్వాలా అన్న చర్చ కూడా ఉంది. అదే సమయంలో కొన్ని బస్సులను మాత్రమే ఫ్రీ సర్వీస్ కోసం రిజర్వ్ చేసి పెడితే మిగిలిన బస్సులలో ఆదాయం వస్తుంది అలాగే ప్రయాణీకులు అందరూ వాటిలో ప్రయాణించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తున్నారుట. అదే విధంగా ఈ నెలాఖరున వచ్చే దీపావళి నుంచి ఉచితంగా మహిళలకు మూడు వంట గ్యాస్ సిలిండర్లను కూడా ఇచ్చే పథకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇక మహిళలు పద్దెనిమిదేళ్ళు నిండితే చాలు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న దాని మీద కూడా మంత్రి మండలి చర్చిస్తుందని అయితే అది మాత్రం ఇపుడే కాదని విధి విధానాలు పూర్తిగా రూపొందించిన మీదటనే నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. అదే విధంగా రైతులకు ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇచ్చే పథకాన్ని కూడా పీఎం కిసాన్ పథకంతో జత చేయడం ద్వారా ఆరు వేల రూపాయల భారాన్ని తగ్గించుకుంటూ మిగిలిన మొత్తానికి విడతల వారీగా అందచేయడానికి చూస్తున్నారని చెబుతున్నారు. ఈ పథకాన్ని సంక్రాంతికి అమలు చేసే విషయం కూడా మంత్రి మండలి సమావేశంలో చర్చిస్తారు అని అంటున్నారు. ఇక తల్లికి వందనం పథకం అయితే వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని అనుకుంటున్నారు. ఏది ఎమైనా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యేలోపుగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్నీ అమలు చేయాలని పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. వైసీపీ నుంచి ఏ ఒక్క విమర్శ రాకుండా ఈ పథకాలను అమలు చేసి తమ సత్తా నిరూపించుకోవాలని టీడీపీ కూటమి చూస్తోంది అని అంటున్నారు. మొత్తానికి ఫ్రీ బస్సు పథకం కనుక దసరాకు అమలు అయితే మహిళలకు పెద్ద బహుమతే బాబు ఇస్తున్నట్లుగా భావించాలి అని అంటున్నారు.

# తిరుమల శ్రీవారు అభిషేక ప్రియుడు

తిరుమల,తిరుమల శ్రీవారు అభిషేక ప్రియుడే కాదు అలంకార ప్రియుడు కూడా. బ్రహ్మోత్సవాల్లో నిత్యం అభిషేకాలు, నైవేద్యాలు, అలంకరణలు ప్రత్యేకతను కలిగి ఉంటాయి. కోట్లాది మంది భక్తుల ఇలవేల్పు శ్రీ వెంకటేశ్వరుని అలంకారం భక్తుల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తోంది. వజ్ర వైఢూర్యాలు బంగారు ఆభరణాలు ధరించి భక్తులకు దర్శనం ఇచ్చి అలంకార ప్రియుడి సేవలో అనునిత్యం తరిస్తున్న పూదండలది ప్రత్యేక స్థానం. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వస్వామి పుష్పాలంకార ప్రియుడుగా భక్తులను కనువిందు చేస్తాడు. శ్రీనివాసునికి చేసే అనేక సేవలలో పుష్పకైంకర్యం అత్యంత ప్రియమైనదిగా నిలిచింది. పవిత్రమైన కార్యమని తిరువాయ్ మొళి అనే ప్రాచీన తమిళ గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. స్వామివారి ఆపాదమస్తకం వివిధ రకాల సుగంధ భరిత కుసుమాలతో అలంకరించే అర్చకులు ఎన్నో పుష్పహారాలను దేవదేవునికి సమర్పిస్తారు. శ్రీనివాసునికి చేసే అనేక సేవలలో పుష్పకైంకర్యం అత్యంత ప్రియమైనదిగా నిలిచింది. పవిత్రమైన కార్యమని తిరువాయ్ మొళి అనే ప్రాచీన తమిళ గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. స్వామివారి ఆపాదమస్తకం వివిధ రకాల సుగంధ భరిత కుసుమాలతో అలంకరించే అర్చకులు ఎన్నో పుష్పహారాలను దేవదేవునికి సమర్పిస్తారు. శ్రీనివాసునికి చేసే అనేక సేవలలో పుష్పకైంకర్యం అత్యంత ప్రియమైనదిగా నిలిచింది. పవిత్రమైన కార్యమని తిరువాయ్ మొళి అనే ప్రాచీన తమిళ గ్రంథంలోనూ ఈ విషయం ఉంది. స్వామివారి ఆపాదమస్తకం వివిధ రకాల సుగంధ భరిత కుసుమాలతో అలంకరించే అర్చకులు ఎన్నో పుష్పహారాలను దేవదేవునికి సమర్పిస్తారు. కిరీటం మీద నుంచి రెండు భుజాలమీది వరకు అలంకరించే ఒకే ఒక దండను శిఖామణి. ఇది ఎనిమిది మూరల దండ. శ్రీవారి భుజాల నుండి ఇరువైపులా పాదాల వరకు వేలాడుతూ ఉండే సాల గ్రామాల మాలలకు ఆనుకొని వేలాడదీస్తూ అలంకరింపబడే పొడవైన పూలమాలలు. ఇవి రెండుమాలలు కాగా ఒక్కొక్కటి సుమారు 4 మూరలు ఉంటాయి. శ్రీవారి భుజాల నుండి ఇరువైపులా పాదాల వరకు వేలాడుతూ ఉండే సాల గ్రామాల మాలలకు ఆనుకొని వేలాడదీస్తూ అలంకరింపబడే పొడవైన పూలమాలలు. ఇవి రెండుమాలలు కాగా ఒక్కొక్కటి సుమారు 4 మూరలు ఉంటాయి. శ్రీవారి మెడలో రెండు పొరలుగా రెండు భజాలపై అలంకరింపబడే దండ కంఠసరి. ఇది ఒకటి మూడున్నర మూరలు ఉంటోంది.శ్రీవారి వక్షఃస్థలంలో ఉన్న శ్రీదేవి భూదేవీ లకు అలంకరించే రెండు పూలదండల్లో ఒక్కొక్కటి ఒకటిన్నర మూర ఉంటుంది. శ్రీవారి వక్షఃస్థలంలో ఉన్న శ్రీదేవి భూదేవీ లకు అలంకరించే రెండు పూలదండల్లో ఒక్కొక్కటి ఒకటిన్నర మూర ఉ ంటుంది. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బొడ్డున వున్న నందక ఖడ్గానికి అలంకరించే దండ ఇది. ఈ పూదండ రెండు మూరలుగా ఉంటుంది. రెండు మోచేతుల కింద, నడుము నుండి మోకాళ్ళపై హారాలుగా, మోకాళ్ళ నుండి పాదాల వరకు వ్రేలాడదీసే మూడు దండలే తావళములు. ఇందులో ఒకటి మూడు మూరలు, మరొకటి మూడున్నర మూరలు, ఇంకొకటి నాలుగు మూరలు ఉంటుంది. శ్రీవారి పాదాలపై చుట్టూ అలంకరించే రెండు దండలే తిరువడి దండలు. ఒక్కొక్కటి ఒక్క మూర ఉండగా ప్రతి గురువారం జరిగే పూలంగి సేవ లో మాత్రమే స్వామివారి మూలమూర్తి కి ఆభరణాలన్నీ తీసివేసి ఈ మాలలతో పాటు నిలువెల్ల స్వామి వారిని విశేషంగా పూలమాలలతో అలంకరిస్తారు. ఇవిగాక శ్రీవారి ఆనంద నిలయంలోని వివిధ ఉత్సవమూర్తులకు కూడా ఎన్నో పూలమాలలు టిటిడి సిద్ధం చేస్తుండగా అర్చక స్వాములు అలంకరిస్తారు. ఉత్సవమూర్తులకు నిత్యమూ అలంకరించే పూలదండల్లో భోగ శ్రీనివాసమూర్తికి ఒక దండ, కొలువు శ్రీనివాసమూర్తికి

# ఈ ఎమ్మెల్యే తీరు మారదే.. మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు!



విజయవాడ:ఆంధ్రప్రదేశ్ లో అధికార కూటమికి చెందిన కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలితో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహార శైలి తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. ఆయన తాజాగా రైతులపై చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. కుక్కలకు ఉన్న విశ్వాసం కూడా రైతులకు లేదని కొలికిపూడి సంచలన వ్యాఖ్యలు వ్యాఖ్యలు చేశారు. తాను వారి కోసం ఎంతో కష్టపడి పనిచేస్తుంటే వారు తనకు మద్దతుగా నిలవట్లేదన్నారు.తన సొంత డబ్బు కోట్లాది రూపాయలను పలువురి వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేశానని కొలికిపూడి తెలిపారు. సాగునీటి కాలువల్లో పూడికతీతకు లక్షలాది రూపాయలు వెచ్చించానని గుర్తు చేశారు. ఎమ్మెల్యే కొలికపూడి వివాదాస్పద వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆందోళనకు రైతు సంఘాలు సన్నద్ధమవుతున్నాయి.కొలికిపూడి ఇటీవల ఎన్నికల్లో తిరువూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్నికల్లో గెలిచీ గెలవగానే ఆయన తిరువూరు నియోజకవర్గంలో ఒక వ్యక్తి ఇంటిని జేసీబీలతో కూల్చివేయడానికి ప్రయత్నించడం వివాదాస్పదమైంది.కొద్ది రోజుల క్రితం టీడీపీకే చెందిన ఒక సర్పంచ్ ను బహిరంగంగా దూషించడంతో సర్పంచ్ భార్య ఆత్మహత్యా యత్నం చేసింది. తాజాగా మీడియా ప్రతినిధులు సైతం సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కొలికిపూడి మీడియా ప్రతినిధులతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అధికార గర్వానికి అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా చంద్రబాబుకు అందజేశారు. ఈ నేపథ్యంలో తనకు అన్నీ తెలుసని సమస్యను పరిష్కరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.ఎన్నికలకు ముందు అమరావతి ఉద్యమ నేతగా కొలికిపూడి పాపులర్ అయ్యారు. ఎన్నికలకు ముందు వివిధ టీవీ చానెళ్ల చర్చల్లో ఆయన తరచూ కనిపించేవారు. అమరావతి రాజధాని ప్రాంతానికి చెందిన కొలికిపూడి వాస్తవానికి తాడికొండ అసెంబ్లీ సీటును ఆశించారు. అయితే చంద్రబాబు ఆయనకు తిరువూరు నియోజకవర్గాన్ని కేటాయించారు. ఈ నియోజకవర్గానికి కొలికపూడి స్థానికుడు కాకపోయినప్పటికీ కూటమి హవాలో గెలుపొందారు.అయితే గెలుపొందినప్పటి నుంచి కొలికిపూడి ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. రెండు రోజుల క్రితం కూడా నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆయనను తమ నాయకుడిగా గుర్తించబోమని రోడ్డు ఎక్కి నినాదాలు చేశారు. నియోజకవర్గంలో టీడీపీని కాపాడాలని నినాదాలు చేశారు.తిరువూరు నియోజకవర్గంలో ఇసుక, మట్టి తవ్వకాలతో ఎమ్మెల్యే కొలికిపూడి భారీగా ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపైన వార్తలు రాసిన తమను బెదిరిస్తున్నారని మీడియా ప్రతినిధులు తాజాగా చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. టీడీపీకి అనుకూలంగా వ్యవహరించే మీడియా సైతం కొలికిపూడి విషయంలో దూకుడుగానే వెళ్తోంది. అయినా కొలికిపూడి తగ్గడం లేదు.సెప్టెంబర్ 29న 'సేవ్ తిరువూరు' పేరుతో ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు ర్యాలీకి నిర్ణయించారు. ఇటీవల పరిణామాల నేపథ్యంలో ఈ ర్యాలీకి ఆయన పిలుపునిచ్చారు. అయితే టీడీపీ అధిష్టానం ఆదేశాలతో ఈ ర్యాలీని విరమించుకున్నారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో ర్యాలీని విరమించుకున్నట్టు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వీడియో విడుదల చేశారు.మళ్లీ ఇంతలోనే కొలికిపూడి మరో వివాదంలో చిక్కుకున్నారు. మహిళా ఉద్యోగుల వాట్సాప్ నంబర్లకు అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ లైంగికంగా వేధిస్తున్నారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని మహిళలు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం చిట్టేలలో మహిళలు ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. మహిళల పట్ల ఎమ్మెల్యే కొలికిపూడి చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.మరోవైపు తనపై చేసిన ఆరోపణలు నిజమైతే అరెస్టు చేసి శిక్షించాలని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అంటున్నారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ ఇప్పటివరకు నాలుగుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారని, ఆమె భర్తపై పోలీసులు ఎప్పుడు కేసు పెట్టినా ఇలాంటి ఆత్మహత్య నాటకం ఆడుతారని ఎమ్మెల్యే ఆరోపించారు. తనపై పథకం ప్రకారం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని తెలిపారు.

# పొలిటికల్‌గా నాగార్జున టార్గెట్ అయ్యారా?

హైదరాబాద్,నిన్న హీరో అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత.. ఇవాళ నాగచైతన్య- సమంత విడాకుల ఇష్యూ.. ఏంటిదంతా..? అనుకోకుండా జరుగుతోందా..? లేక కావాలనే టార్గెట్ చేశారా..? ఎన్ కన్వెన్షన్ కూల్చివేత టైమ్‌లో అక్కినేని నాగార్జున ఫ్యామిలీని తెలంగాణ సర్కార్ టార్గెట్ చేసిందన్న ఆరోపణల్లో నిజం ఉందా..? ప్రస్తుతం కొండా సురేఖ రగిల్చిన రాజకీయ చిచ్చు.. కాంగ్రెస్ పార్టీని, రేవంత్ సర్కార్‌ను ఇరకాటంలో పడేసిందా..? ఇంతకీ బ్యాగ్రౌండ్‌లో ఏం జరిగింది..?రాజకీయ నేతలు, సినిమాస్టార్లది అవినాభావ సంబంధమే. మరీ ముఖ్యంగా సినీ నటులకు పొలిటికల్ లీడర్లకు మధ్య సత్సంబంధాలు ఉండటం కామనే. అయితే.. ఇవి ఒక్కోసారి అనుకోని ఇబ్బందులుగా మారుతుంటాయి. ఇప్పుడు టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున ఫ్యామిలీ విషయంలోనూ ఇదే జరుగుతోందన్న చర్చ మొదలైంది.హైడ్రా.. ఈ పేరు చెబితే అంతా హడల్. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా రగులుతూనే ఉంది. హైడ్రా పేరు మార్మోగింది మాత్రం.. నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేసినప్పుడే. సినిమా రంగంలో పెద్ద కుటుంబానికి చెందిన నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను హైడ్రా కూల్చేసిందంట అనే వార్త అటు టాలీవుడ్‌లో, ఇటు పొలిటికల్ సర్కిల్స్‌లో తెగ హడావుడి చేసేసింది.దీనిపై రోజుల తరబడి చర్చోపచర్చలు జరిగాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి నాగార్జున సన్నిహితంగా మెలిగే వారని.. అందుకే ఆయన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌కు ఎసరొచ్చిందన్న వాదనలు టాలీవుడ్ అండ్ పొలిటికల్ సర్కిల్స్‌లో బాగా హల్ చల్ చేశాయి. అప్పట్లో నాగార్జున కోడలుగా ఉన్న ఇప్పటి మాజీ కోడలు , హీరోయిన్ సమంత తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేవారు.

### రేవంత్ సర్కార్ టార్గెట్ చేసిందా?

ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీంతో బీఆర్ఎస్‌నే కాకుండా గతంలో ఆ పార్టీకి సన్నిహితంగా మెలిగిన వారిని కూడా రేవంత్ సర్కార్ టార్గెట్ చేసిందన్న వాదనలు ఉన్నాయి. అందుకే ఎస్పెషల్లీ టాలీవుడ్‌కు చెందిన వారిలో నాగార్జున టార్గెట్‌గా ఆయనకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఇష్యూలో రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకత కంటే సానుకూలతే ఎక్కువ వచ్చిందని చెప్పాలి.సీఎం రేవంత్ నాగార్జునను ప్రత్యేకంగా ఏమీ టార్గెట్ చేయలేదని.. హైడ్రా బాధ్యతల నిర్వహణలో భాగంగా తన, పర బేధం లేకుండా ఒకే ధోరణిలో వెళ్తోందన్న వాదనలు వినిపించాయి తనవాళ్లు, పరాయి వాళ్లనే తేడా లేకుండా ఆక్రమణల కూల్చివేతలో హైడ్రా పారదర్శకంగా వ్యవహరించిందని రేవంత్ సర్కార్‌పై కొందరు ప్రశంసలు కురిపించారు కూడా. ఆ తర్వాత దీనిపై పెద్దగా చర్చ జరగలేదు. సో.. ఈ ఇష్యూలో ప్రభుత్వానికి పాజిటివ్ మైలేజ్ బాగానే వచ్చిందని చెప్పాలి.అయితే ఇప్పుడు



కాంగ్రెస్ ప్రభుత్వం డిఫెన్స్‌లో పడే సిచ్యుయేషన్ వచ్చింది. అది కూడా అక్కినేని నాగార్జున ఫ్యామిలీ గురించే. మంత్రి కొండా సురేఖ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించారు. ఇందులో హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంతల విడాకుల అంశం ప్రస్తావించడం పొలిటికల్ దుమారాన్ని రేపింది. అసలు నాగార్జున, చైతూ, సమంతలకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకున్నా.. వారిని ఈ చర్చలోకి లాగడం పెద్ద వివాదమైకూర్చుంది.

### ఏ ఉద్దేశంతో చేశారు?

అటు రాజకీయ నేతల నుంచే కాకుండా ఇటు టాలీవుడ్ ప్రముఖుల నుంచి కూడా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఏ ఉద్దేశంతో వాళ్లను ఇందులోకి లాగి కాంట్రవర్సీని చేశారన్న చర్చ జరుగుతోంది. ఇది అనుకోకుండా జరిగిందా..? లేక వాంటెడ్‌లీ నాగార్జున ఫ్యామిలీ టార్గెట్‌గా జరిగిందా..? అనేది అందరిలో మెదులుతున్న ప్రశ్న. గతంలో నాగ్ బీఆర్ఎస్ సర్కార్‌తో రాసుకుపూసుకు తిరగడం వల్లే ఈ నిందలను పడాల్సి వస్తోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను కూల్చినప్పుడు ఇదంతా పరిపాలనా సంస్కరణలో భాగమన్న వాదనలు వినిపించాయి. రేవంత్ సర్కార్ చేసిన దాంట్లో పెద్ద తప్పేం లేదని.. ఎవరి ఒత్తిడిలకు ప్రభుత్వం లొంగకుండా ముక్కుసూటిగా వెళ్తోందన్న ప్రశంసలు దక్కాయి. అట్ ద సేమ్ టైమ్.. ఈసారి మాత్రం కొండా సురేఖ వ్యాఖ్యలతో రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడాల్సి వచ్చింది.తీవ్రమైన వ్యతిరేకత పొలిటికల్, సినీ వర్గాల నుంచి ఎదుర్కొంటోంది కాంగ్రెస్ సర్కార్. ఇది ఓరకంగా రేవంత్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసిందని అనుకుంటున్నారు. నిజంగానే నాగార్జునను టార్గెట్ చేసుకుని కావాలనే ఈ వ్యాఖ్యలు చేశారన్న నిందలు ప్రభుత్వంపై పడుతున్నాయి. మరి ఈ వివాదానికి ఎలా ముగింపు పలుకుతారనేది చూడాలి.

# సురేఖ వ్యాఖ్యలు కాంగ్రెస్ ని ఇరకాటంలో పడేశాయా?

హైదరాబాద్,ప్రస్తుతం దేశవ్యాప్తంగా నాగార్జున కుటుంబం, సమంతలపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. నెటిజన్ల నుంచి ప్రముఖ నటీనటులంతా కొండా సురేఖ పై ఫైర్ అవుతున్నారు. ఇక ఇండస్ట్రీ వర్గాలు అయితే అనవసరంగా రాజకీయాల్లోకి ఎందుకు సినీ నటులను లాగుతున్నారు అంటూ భగ్గుమంటున్నాయి. రాజకీయ లబ్ధి కోసం ఎలాంటి సంబంధం లేని సినిమా వాళ్ల గురించి ప్రస్తావించి, వాళ్ళ పరువు ప్రతిష్టలను దిగజార్చడం కరెక్ట్ కాదనీ, తమ జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తున్నారు. అక్కినేని ఫ్యామిలీ పై ఆమె చేసిన అసభ్యకర వ్యాఖ్యలను ఖండిస్తూ సినీ సెలబ్రిటీలందరూ ట్వీట్స్ చేస్తుండగా, నాగార్జున మంత్రి సురేఖపై పరువు నష్టం దావా వేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ కేసులో నాగార్జునకు చుక్కెదురయింది. నాగార్జున వేసిన పిటిషన్ వాయిదా పడినట్టుగా తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి రాజకీయాలు చర్చకు దారితీశాయి. ఎప్పుడూ లేని విధంగా ఈసారి రాజకీయ పార్టీలు, సినీ ఇండస్ట్రీ మధ్య యుద్ధం కొనసాగుతోంది. దీనంతటికి నిన్న మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలే. ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలతో ఇప్పుడు సినీ ఇండస్ట్రీ నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేక వినిపిస్తోంది. నాగచైతన్య-సమంత విడాకుల గురించి తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సురేఖ హీరోయిన్ సమంతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాగచైతన్య-సమంత విడిపోవడానికి కేటీఆరే కారణమంటూ మాట్లాడారు. హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి వారికి డ్రగ్స్ అలవాటు చేసి వాడుకుంటున్నారని కేటీఆర్‌పై విమర్శలు చేశారు. అయితే.. ఇదే క్రమంలో సమంతపై చేసిన వ్యాఖ్యలు సినీ ఇండస్ట్రీని మొత్తం ఆలోచనలో పడేశాయి. నాగచైతన్య-సమంత విడాకుల గురించి తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సురేఖ హీరోయిన్ సమంతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాగచైతన్య-సమంత విడిపోవడానికి కేటీఆరే కారణమంటూ మాట్లాడారు. హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేసి వారికి డ్రగ్స్ అలవాటు చేసి వాడుకుంటున్నారని కేటీఆర్‌పై విమర్శలు చేశారు. అయితే.. ఇదే క్రమంలో సమంతపై చేసిన వ్యాఖ్యలు సినీ ఇండస్ట్రీని మొత్తం ఆలోచనలో పడేశాయి. దాంతో ముందుగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సినీనటుడు నాగార్జున స్పందించారు. మీ పార్టీల వ్యక్తిగత అంశాల్లోకి, రాజకీయాల్లోకి తమను లాగొద్దని కోరారు. అలాగే.. తనపై చేసిన విమర్శలకు సమంత కూడా రియాక్ట్ అయ్యారు. తన విడాకుల అంశంలో ఎలాంటి రాజకీయ కోణం లేదని చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్లనే తాను విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఇద్దరం ఒప్పుకునే తాము విడాకులు పొందామని అన్నారు. అనంతరం నాగ చైతన్య కూడా సురేఖ వ్యాఖ్యలపై స్పందించారు. అయితే.. ఆయన సొంతంగా మెస్సేజ్



ఏం చేయనప్పటికీ.. నాగార్జున చేసిన మెస్సేజ్‌నే రీ ట్వీట్ చేశారు. ఇక.. నాగార్జున అమల కూడా చాలా సీరియస్ అయ్యారు. మంత్రిని మనిషివా.. పశువువా అనే కోణంలో సంభోదించారు. ఇలా.. ఒక్కొక్కరిగా నిన్నటి నుంచి కొండా సురేఖ వ్యాఖ్యలపై సినీ ఇండస్ట్రీ నుంచి హీరోలు, నిర్మాతలు, ఇతర పెద్దలు స్పందిస్తూనే ఉన్నారు. చిరంజీవి, నాని కూడా సురేఖ వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఇప్పుడు సురేఖ మాట్లాడిన తీరును విమర్శిస్తూ సినీ ఇండస్ట్రీ మొత్తం ఏకమైంది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు సైతం తనదైన స్టైల్‌లో స్పందించి వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు వినోదాన్ని పంచేందుకు కష్టపడుతున్న తమను రాజకీయాల్లోకి లాగి ఇబ్బందులు పెట్టొద్దని అన్నారు. ఇక.. ఇప్పటికే హైడ్రా రగడతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇమేజీ కాస్త డ్యామేజీ అయింది. హైడ్రా వల్ల పేదలకు ఎవరికీ నష్టం లేదని ప్రభుత్వం చెప్పినప్పటికీ చాలా వరకు విమర్శలు ఆగలేదు. ముఖ్యంగా మూసీ నిర్వాసితుల నుంచి ఆ నిరసన మరింత ఎక్కువగా కనిపించింది. చివరకు పార్టీలను ఆశ్రయించి.. వారి మద్దతు కోరాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో గత మూడు రోజులుగా రాష్ట్రంలో హైడ్రా చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ నేతలు పోటాపోటీగా మూసీ నిర్వాసితులను కలుస్తూ ప్రభుత్వం దుమ్మెత్తిపోస్తున్నారు. నిన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం బస్తీల్లో పర్యటించి వారికి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. వారికి అండగా ఉంటామని చెప్పారు. హైడ్రా వివాదం ఇలా కొనసాగుతుండగానే కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీని మరింత ఇరకాటంలో పడేశాయి. ఆమె చేసిన వ్యాఖ్యలను ఇప్పటికే రాజకీయ పార్టీలు, సినీ ఇండస్ట్రీ పెద్దలు ఖండించగా.. తాజాగా ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. మరి ఈ క్రమంలో ప్రభుత్వం, పార్టీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. అయితే సమంతా-చై ఎందుకు విడాకులు తీసుకున్నారో నీకు చెప్పాలా ? అంటూ అక్కినేని ఫ్యాన్స్ ఫైర్ అవుతున్నారు. మరి ఈ వివాదం ఎక్కడికి దారి తీస్తుందో చూడాలి.

# రెండో అత్యంత సంపన్నుడిగా జుకర్‌బర్గ్




న్యూఢిల్లీ,ప్రస్తుతం ప్రపంచంలో రెండో అత్యంత సంపన్న వ్యక్తిగా ఉన్న అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు షాకింగ్ న్యూస్ వచ్చింది. ఎందుకంటే తాజాగా మార్క్ జుకర్‌బర్గ్ తొలిసారిగా ప్రపంచంలోనే రెండో అత్యంత సంపన్నుడిగా అవతరించారు.ఈ క్రమంలో సంపద పరంగా జుకర్ బర్గ్.. అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్‌ను వెనక్కినెట్టడం విశేషం. మెటా ప్లాట్‌ఫాం షేర్లలో నిరంతర పెరుగుదల కారణంగా ఈ ఘనతను సాధించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం జుకర్‌బర్గ్ నికర విలువ గురువారం ఆల్ టైమ్ గరిష్ట స్థాయి $206.2 బిలియన్లకు చేరుకుంది. ఈ పెరుగుదల సంపద పరంగా అమెజాన్ బెజోస్ కంటే $1.1 బిలియన్లు ఎక్కువ పెరిగింది. ఇప్పుడు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మాత్రమే అగ్రస్థానంలో ఉన్నారు. ఆయన సంపద జుకర్‌బర్గ్ కంటే దాదాపు 50 బిలియన్ డాలర్లు ఎక్కువ. మెటా తన ఆన్‌లైన్ అడ్వర్టైజింగ్ ప్లాట్‌ఫారమ్‌ల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడటానికి దాని కృత్రిమ మేధస్సు పెట్టుబడులను దాని విక్రయాల వృద్ధికి ఒక కారణంగా పేర్కొంది. ఫిబ్రవరి 2022లో గోప్యతా మార్పుల కారణంగా $10 బిలియన్ల ఆదాయ నష్టాన్ని చవిచూసినట్లు Meta తెలిపింది. రెండో త్రైమాసిక అమ్మకాల గురించి గణాంకాల కంటే మెరుగ్గా నివేదికలు వచ్చిన నేపథ్యంలో మెటా షేర్లు 23% పెరిగాయి. దీంతో గురువారం కంపెనీ షేర్లు ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 582.77 డాలర్ల వద్ద ముగిశాయి. డేటా సెంటర్‌లు, కంప్యూటింగ్ పవర్‌పై మెటా భారీగా ఖర్చు చేసింది. ఈ విషయంలో జుకర్‌బర్గ్ AI రేసులో ముందంజ వేయడానికి కృషి చేస్తున్నాడని చెప్పవచ్చు. ఈ క్రమంలో కంపెనీ దీర్ఘకాలిక ప్రాజెక్టులపై కూడా పని చేస్తుంది. వీటిలో ఓరియన్ ఆగ్మెంటెడ్ రియాలిటీ గ్లాసెస్ కూడా ఉన్నాయి. వీటిని కంపెనీ గత నెలలో ప్రకటించింది. వాల్ స్ట్రీట్ ఏడాది పొడవునా మెటాపై స్థిరంగా బుల్లిష్ ట్రెండ్ కొనసాగింది. విశ్లేషకుల అంచనాలను మించిన త్రైమాసిక ఆదాయాలను కంపెనీ నిలకడగా నివేదించింది. జూలైలో మెటా తన రెండవ త్రైమాసిక అమ్మకాలు 22% పెరిగి $39.07 బిలియన్లకు చేరుకున్నాయి. ఇది వరుసగా నాలుగో త్రైమాసికంలో 20% కంటే ఎక్కువ ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. కాలిఫోర్నియాకు చెందిన మెన్లో పార్క్ కంపెనీలో 13% వాటాను కలిగి ఉన్న జుకర్‌బర్గ్, ఈ ఏడాది ఇప్పటివరకు తన సంపదను %వి%78 బిలియన్లను పెంచుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ ఇండెక్స్ ప్రకారం ప్రపంచంలోని 500 మంది ధనవంతులలో ఈ పెరుగుదలనే అత్యధికం కావడం విశేషం. దీంతో 40 ఏళ్ల జుకర్‌బర్గ్ ఈ ఏడాది సంపద సూచీలో నాలుగు స్థానాలు ఎగబాకారు. మెటాలో మార్క్ జుకర్‌బర్గ్‌కు 13% వాటా ఉంది.

# పాకిస్థాన్‌కు వెళ్లనున్న ఎస్. జైశంకర్..

న్యూఢిల్లీ,పాకిస్థాన్‌లోని అక్టోబర్ 15, 16వ తేదీల్లో షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశం జరగనుంది. అయితే ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ వెళ్లనున్నారు. 2015 డిసెంబర్ తర్వాత భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌కు వెళ్లడం ఇదే తొలిసారి.పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో అక్టోబర్ 15, 16వ తేదీల్లో షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశం జరగనుంది. అయితే ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ వెళ్లనున్నారు. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వశాఖ ధృవీకరించింది. గత ఏడాది ఈ సమావేశానికి మన దేశమే అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. గోవాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పుడు ఈ మీటింగ్‌కి అప్పటి పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ బుట్టో కూడా హాజరయ్యారు. అయితే ఈ ఏడాది పాకిస్థాన్‌లో జరగనున్న ఈ సమావేశానికి భారత్ తరపున వెళ్లాలా ? వద్దా ? అనేదానిపై గత కొన్నిరోజులుగా చర్చలు జరిగాయి. చివరికి కేంద్రమంత్రి జైశంకర్ ఈ మీటింగ్ వెళ్లనున్నారని.. విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ఒక విదేశాంగశాఖ మంత్రిగా జైశంకర్ పాకిస్థాన్‌కు వెళ్లనుండటం ఇదే మొదటిసారి కావడం విశేషం. షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ లో భారత్, చైనా, పాకిస్థాన్, రష్యా, కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజికిస్థాన్, అలాగే ఉజ్బెకిస్థాన్ దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. ప్రతీఏడాది ఒక్కో దేశంలో ఈ సమావేశాలు జరగుతుంటాయి. రొటేషన్ పద్ధతిలో భాగంగా ఈసారి పాకిస్థాన్‌కు అతిథ్యం ఇచ్చే అవకాశం వచ్చింది. ఆగస్టులోనే ఎస్‌సీఓ మీటింగ్‌కు హాజరుకావాలని ప్రధాని మోదీకి పాకిస్థాన్ ఆహ్వానం పంపింది. దీనిపై నిర్ణయం తీసుకుంటామని అప్పట్లో జైశంకర్ ప్రకటించారు. కానీ ఎట్టకేలకు జైశంకరే ఈ ఎస్‌సీఓ శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రతినిధి బృందం తరపున నాయకత్వం వహిస్తారని విదేశాంగ శాఖ ప్రకటించింది.



ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైతం హాజరుకానున్నట్లు తెలుస్తోంది. 2015 డిసెంబర్ తర్వాత భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. దివంగత మాజీ విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ 2015లో ఆఫ్ఘనిస్తాన్‌కు సంబంధించి భద్రతా సదస్సులో పాల్గొనేందుకు ఆమె ఇస్లామాబాద్‌కు వెళ్లారు. ఇదిలాఉండగా.. ఎస్‌ఈఓ శిఖరాగ్ర సమావేశాలకు ముందుగా మంత్రివర్గ సమావేశం, అలాగే ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య ఆర్థిక, సామాజిక-సాంస్కృతిక, మానవతా సహకారంపై దృష్టి సారించే విధంగా పలు సీనియర్ అధికారుల సమావేశాలు జరుగనున్నాయి. 2001లో షాంఘైలో.. షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్‌ను.. చైనా, రష్యా, కజకిస్థాన్, తజికిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, ఉజ్బెకిస్థాన్ దేశాలు కలిసి ప్రారంభించాయి. 2017లో భారత్, పాకిస్థాన్ ఈ ఎస్‌సీఓలో శాశ్వత సభ్యత్వం పొందాయి. గత ఏడాది జులైలో భారత్‌లో నిర్వహించిన వర్చువల్ సమ్మిట్ ఆఫ్ గ్రూపింగ్‌లో ఇరాన్ కూడా ఈ ఎస్‌సీఓలో శాశ్వత సభ్యత్వం పొందింది.

# పల్లెల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం..



జన్నారం, గ్రామాల అభివృద్ధి బీజేపీ పార్టీతోనే సాధ్యమని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వాన్ని ఎంపీ, ఖానాపూర్ బీజేపీ అసెంబ్లీ నేత రితీష్ రాథోడ్, సభ్యత్వ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలంతా కాంగ్రెస్ పాలనలో విసిగిపోయారన్నారు. ప్రస్తుతం ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని, బీజేపీతోనే అన్ని సాధ్యమని ఆయన చెప్పారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం చాలా మంచి పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆదరణ పొందేలాగా చూడాలని ఆయన తెలిపారు.ఈ నేపథ్యంలోనే సభ్యత్వాలు చురుగ్గా చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జి.మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎస్టీ మోర్చాజిల్లా అధ్యక్షుడు బద్రీనాయక్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గాజుల దేవేందర్, మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెదడ గోపాల్, యువజన అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, మాజీ మండల అధ్యక్షులు వీరచారి గోలిచందు, టౌన్ అధ్యక్షుడు రాగుల సూర్యం, నేతలు అప్పాల జలపతి, జగన్, పవన్ యాదవ్ వేయికండ్ల రవి, గోపాల్, రవి నాయక్, బోడ తిరుపతి, ముక్కెర మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com